UNIVERSAL LIBRARY
OU_204203
UNIVERSAL LIBRARY

# విన్నపము

హిందీలోని ప్రసిద్ధ కథారచయితల ఉత్తమ కథలను అనువదించి, తెలుగుసాహిత్యానికి అందజేయాలని నా ఉద్దేశం అయితే, ప్రసిద్ధరచయితలు చాలమంది వున్నారు. కనుక, అందరినీ ఈ సంపుటిలో పరిచయం చేయలేక పోయాను.

ఇక, ఏది మంచికథ, ఏది మంచి కథ కాదు? – అన్నది పెద్ద ప్రశ్న. ఎంత మంచి కథ అయినా కొందరికి నచ్చకపోవచ్చు, మామూలు కథకూడ చాలమందిని ఆకర్షించ వచ్చు. పాఠకుని అభిరుచిని బట్టి కథ యొక్క మంచి చెడ్డలు ఆధారపడి వుంటాయి. కొందరికి ప్రేమ కథలు కావాలి. కొందరికి సాంఘిక కథలు కావాలి, మరి కొందరికి ఆర్థిక విషయాల్ని గూర్చిన కథలు కావాలి. అందుచేత మచ్చుకు రకరకాల కథలను అనువదించాను.

కథలతోపాటు మూల రచయితల జీవితాలను, రచనలలోని విశేషతను కూడ క్లుప్తంగా వ్రాశాను. మూల రచయితలను బాగా గుర్తుంచుకొనుటకు వారి జీవితచరిత్రలు చాల వరకు ఉపయోగపడగలవని నా ఉద్దేశం.

ఇందులో ప్రసిద్ధ రచయితలు వ్రాసిన, ఒక్కొక్క కథనే అనువదించి కూర్చాను. అయితే, ఆ ఒక్క కథను చదివి, రచయిత యొక్క రచనా విధానాన్ని, భావాల్ని, అభిప్రాయాల్ని

తెలుసుకోన ప్రయత్నించ వద్దని నా ప్రార్థన. ఏ ఒక్క రచయిత ప్రతిభనైనా సంపూర్ణంగా తెలుసుకోవాలంటే, ఆ రచయిత వ్రాసిన గ్రంథాలన్నీ చదవడం మంచిది.

ఈ తెలుగు అనువాదములోని కొన్నికథలు లోగడ సుజాత, సుభాషిణి, వినోదిని మొదలైన పత్రికల్లో ప్రచురింపబడినవి. ఆ పత్రికల సంపాదకులకు, ఈ కథలకు పుస్తక రూపాన్ని యిస్తున్న ఉమా పబ్లిషర్స్, (విజయవాడ) వారికి నా ధన్యవాదాలు.

భవదీయుడు
విశ్వప్రసాద్.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. కళోపాసకులు : | శ్రీ జయ్ శంకర్ 'ప్రసాద్' | 2 |
| 2. నింద : | శ్రీ ప్రేమ్‌చంద్ | 11 |
| 3. ఎవరి అదృష్టం వారిది : | శ్రీ జైనేంద్రకుమార్ | 19 |
| 4. కవిభార్య : | శ్రీ సుదర్శన్ | 34 |
| 5. తేనెపూసిన కత్తి : | శ్రీ చతుర్ సేన్ శాస్త్రి | 63 |
| 6. బాబు ! ఒకకాని ! : | శ్రీ రామ్‌చంద్రశర్మ | 72 |
| 7. తొలిచూపు : | శ్రీ గోవింద వల్లభ్ పంత్ | 81 |

# శ్రీ జయ్ శంకర్ 'ప్రసాద్'

జయ్ శంకర్ 'ప్రసాద్' కాశీలో ప్రసిద్ధిజెందిన ధనిక వైశ్యకుటుంబములో క్రీ॥ శ॥ **1889** లో జన్మించారు. ఎనిమిదవ తరగతిలోనే స్కూలు విడిచి, యింటివద్దే యింగ్లీషు, హిందీ, ఉర్దూ, సంస్కృత భాషలను అభ్యసించారు. ఈయన హిందీ లో మొదట 'కవి'గా ప్రసిద్ధి కెక్కారు. తర్వాత కథలు, నాటకాలు, నవలలు వ్రాశారు. ఈ యన వ్రా సి న "కామాయని" అనే కావ్యము ఉన్నత వర్గానికి చెందిన ఉత్తమ మహాకావ్యం.

ఈయన భాష క్లిష్టంగా, పటుత్వంతో వుంటుంది; భావాలు అతి గూఢంగాను, మనోరంజకంగాను ఉంటాయి. ఈయనది సంస్కృతి మిశ్రితమైన శైలి.

ఈ మహాకవి హిందీ సాహిత్యానికి అమోఘమైన సేవచేసి, అమూల్యమైన గ్రంథాలను ప్రసాదించి క్రీ॥ శ॥ **1937** లో స్వర్గాన్ని అలంకరించారు.

# కళోపాసకులు

మూలం : జయ్ శంకర్ 'ప్రసాద్'

ఆమె తండ్రి ఆమెను అతి ముద్దుగా 'కళ' అన్నాడు. ఆమె నేత్రానందమును గొల్పే పూర్ణ శశికళ వంటి సౌందర్య వతి. విద్యాలయంలోని వారందరి దృష్టి ఆ సహజ, సరళ బాలికపైనే వుంటుంది. కాని రూపనాథ్, రసదేవులు ఆమె ప్రత్యేకప్రియులు. కళకూడ అప్పుడప్పుడు ఆ యిరువురితోనే మాట్లాడుతుంటుంది; లేకపోతే, ఆమె ఒక సుందర నిశ్శబ్దంగా తయారవుతుంది.

ముగ్గురు పరస్పరం ప్రేమించుకుంటారు. అయినా, వారిలో ద్వేషం వుంది. ఒకరు మరొకర్ని ఎక్కువగా తమ వైపుకు ఆకర్షింప జేసుకోవాలనుకుంటారు. విద్యార్థి వసతి గృహం (Hostel) లోని పిల్లలతో వారికి స్నేహమే లేదు. ఇతర విద్యార్థులు, విద్యార్థినులు ఎప్పుడు చూచినా ఈ ముగ్గురి గురించే చర్చిస్తుంటారు.

'కళ అసలు కన్నెత్తి చూడటమే లేదు' అంటాడొక విద్యార్థి.

'రూపనాథు అందమయిన వాడే, కాని చాల క్రూరుడు' అంటాడు మరొక విద్యార్థి.

'రసదేవ్ పిచ్చివాడు. అతనిలో ఎంత అలజడి వుందో అర్థంకాదు. కళను అందరికంటే, ఎక్కువగా ప్రేమించేవానిలా,

అతని కళ్ళలో నిశ్చలమైన అనురాగ మున్నది.' అంటాడు వేరొక విద్యార్థి.

ఇటువంటి విమర్శకులమీద దృష్టి వుంచడానికి ఆ ముగ్గురికి అవకాశమే లేదు. వాళ్ళు వసతి గృహంలోని పూలవనంలో ఏవేవో వింత వింత వూహాల్లో లీనమై పోతుంటారు. ఎదురుగా గులాబిపువ్వు మీద, ఒక నీలివర్ణపు సీతాకోక చిలుక కూర్చుని వుంది. కళ దానివంక చూస్తూ అస్పష్ట స్వరంతో పాడుతూవుంది. ఆమె లజ్జాపూరిత స్వరతరంగాలు దాక్కొంటున్నాయి. సన్నని పెదిమలంతో నిర్మింపబడిన చిన్న నోరు దానిని కప్పిపుచ్చడానికి అసమర్థత సూచిస్తున్నది. 'రూప్' దీర్ఘంగా చూస్తున్నాడు. 'రస్' తన రెండు కళ్ళతోను నీలివర్ణపు ఆకాశంలోకి చూస్తూ, ఆ తుమ్మెదలలోని మాధుర్యమతిలో కలిసి పోతున్నాడు.

రూప్:-"ఆహాః కళ! నువ్వు అస్పష్టస్వరంతో నీ పెదిమలలో ఎన్ని అలలు ఆడుకుంటున్నాయి! మానవ రంగస్థలం మీద, ఆరోహణావరోహణాలలో చెరగని రేఖలుగా ఎన్నో భావాలు తయారవుతున్నాయి." రూప్ మాటలు విని, కళ పాట ఆపు చేసింది. రసభగ్నత వలన రసదేవ్ కనుబొమ్మలు ముడిచి, ఆమెవంక చూశాడు.

కళ:-"యిక నేను యింటికి వెళ్ళిపోతాను; నా చదువు పూర్తయింది."

ఇద్దరూ నిరాశజెందారు.

రూప్:-"నేను నీ బొమ్మను చిత్రించి, దానికి పూజ చేస్తాను."

రస్:-"బాగుంది. నిన్ను అసలు మరచిపోగలనా?"

కళ వెళ్ళిపోయింది. ఒకరోజున వసంత పద్మాలు వికసించాయి. వాటి పరిమళంతో వసతి గృహంలోని వనమంతా నిండిపోయింది. రూపనాథు, రసదేవులు కూర్చుని కళ గురించి మాట్లాడుతున్నారు.

"ఆమె ఎంత అందమయింది!" అన్నాడు రూపనాథు.

"ఆమె హృదయ సౌందర్యంయొక్క ధ్యానమే లేదు నీకు!" అన్నాడు రసదేవ్,

"హృదయ సౌందర్యాన్నే ఆకృతి గ్రహిస్తుంది. అప్పుడే సౌందర్యం పరిపక్వం పొందుతుంది."

"కాని అప్పుడప్పుడు హృదయగతి ఆకృతివలన బయటపడదు. కళ్ళు మోసపోతాయి."

"నేను రూపంతో హృదయగతిని కొలుస్తాను. రసదేవ్! నేను చిత్రకళలో ప్రవీణుడననీ నీకు తెలియదా? కావలసినప్పుడు చిత్రాన్ని గీసి, ఆమెను ప్రత్యక్షం చేసుకొంటాను. ఆమె వియోగం నాకు అంతగా బాధ కలిగించలేదు."

"ఆహా! రూపనాథ్! నీ కోరిక సాధనాయుత నిర్వివాదమయింది. అంతరవస్తువును బయటకు తెచ్చి, కల్మషముతో కూడిన ప్రపంచ వాయువుతో దానిని నష్టపరచడం ......"

"చాల్లే. నీ మనస్సులోనే పాడుకో. అసలు నీ హృదయంలో ఏమైనావుందా? విప్పి చెప్పగలవా? చూపించగలవా?" అంటూ రూపనాథు లేచి వెళ్ళిపోబోయాడు.

కంగారుగా వెనుకనుంచి అతని భుజంపట్టుకొని "అయితే నేను అమెను ఆరాధించడానికిఅసమర్థుడనా?"అన్నాడురసదేవ్.

రూపనాథు తృణీకార భావంతో చూస్తూ నవ్వుతూ వెళ్ళిపోయాడు.

## 2

అదుపులేని కాల వాయువు ఆముగ్గురిని ప్రపంచ ఆవరణాలోకి విసరింది; కాని వారు ఎప్పుడూ ఒకరినొకరు స్మరించుకొంటూనే వున్నారు. రూపనాథు గొప్పచిత్రకారుడయ్యాడు. ప్రత్యేకించి కళ చిత్రాన్ని గీయాలని అతను తన అభ్యాసాన్ని యింకా అభివృద్ధి చేశాడు. తన పవిత్ర ప్రేమ పూజకు ఎల్లప్పుడు క్రొత్త వస్తువులను సమకూర్చేవాడు. వాయు వీచికల వలన విసుకు జెందిన పూల అందాన్ని చక్కని చిత్రాల్లో చిత్రించాడు. ఆంతరిక ఆందోళనలోని బాహ్య దృశ్యాలు అతని కుంచెవలన రూపాన్ని ధరించి అనేక సుందరాకృతుల్లో స్థిరంగా తయారయ్యాయి. అతనికి గొప్ప కీర్తి వచ్చింది. అయినప్పటికి, అతని గర్వపూరితమైన శిరస్సు చిత్రశాలలోకిరాగానే ఎందుకు వంగిపోతుందో తెలియదు; అతనికి తన లోటు తెలుసుకొని ఎవరితోను చెప్పేవాడు కాదు. అతను ఈ రోజు కూడ కళ చిత్రాన్ని తను అనుకొన్నట్టుగా గీయలేక పోయాడు.

రసదేవుని జీవితం నీరవ నికుంజాలలో గడుస్తున్నది. అతను మౌనంగా వుంటుంటాడు. నది ఒడ్డున కూర్చుని, ఆనలి ఒడ్డుయొక్క శోభను చూస్తూ వుండగా చీకటి క్రమ్ముకొం టుంది; ఇది అతని దినచర్య. నక్షత్రమాలతో శోభాయమా నముగా వున్న ఆకాశము క్రింద కూర్చుని మౌనంగా, నిశ్చ లంగా, కుతూహల నయనాలతో ఏదో తెలుసుకోడానికి ప్రయ త్నించడం అతనిరాత్రి చర్య.

ఏవేవో కొన్ని విచిత్ర సంగీత ధ్వనులు, కొన్ని అస్పష్ట మైన ఛాయలు అతని హృదయములోని రహస్యాలు. కాని ప్రజలు అతనిని పని-పాటలు లేని పిచ్చివాడు, సోమరి అనే వారు.

నది వెన్నెలలో ధ్వని చేసుకుంటూ ప్రవహిస్తున్నది. రసదేవుడు వూహానేత్రాలతో చూశాడు. అకస్మాత్తుగా నదీ జలం ఆగిపోయింది. పచ్చని తామర తూడుమీద, సహస్రదళ ములు గల ఒకమణి పద్మము జలస్థలముల నుండి పైకి వచ్చి గాలిలో వూగ నారంభించింది. స్వరాల వలన తరంగాలలో ఒకమూర్తి తయారయింది; గజ్జెలు మోగ నారంభించాయి. మందగతితో చంచల ఆసనం మీద కాలు పెడుతూవుండగా, ఒక వెలుగు వచ్చి ఆ నేత్రాలమీద కూర్చుంది.

రసదేవుడు పాడ నారంభించాడు. అతను నీలి వెన్నెల లోని చెడ్డరోజుల దుఃఖగాథను, నేటి వైభవోపేతమైన రాత్రి లోని ఆనంద కథను సమ్మిళితంచేసి చెప్ప నారంభించాడు. ఆ

వెలుగు వింటూ నవ్వి వెళ్ళిపోయింది; గజ్జెల మధుర ధ్వని తన సహాచర్య ఆధారాన్ని అన్వేషిస్తూ వెళ్ళిపోయింది. విశ్వరూపం రసమయ మయింది. ప్రకృతిలో పరివర్తన కలిగింది. రసదేవుని కండ్లు దూరదృష్టిని పొందేయి. ఈనాడు రసదేవుని అవ్యక్త హృదయ ధ్వని సార్థకమయింది. అతను మధుర గీతాలుపాడ నారంభించాడు.

## 3

నగరంలో చాల అట్టహాసంగా వుంది. అందరూ నాటకశాల వైపుకు పరుగెత్తుతున్నారు. నాటకశాలలో మొదటి శ్రేణిలో ప్రసిద్ధ చిత్రకారుడు రూపనాథ్ సగర్వంగా కూర్చున్నాడు. భాగ్యవంతులు, విద్వాంసులు, అధికారులు, తమ తమ ఆసనాలను అలంకరించారు. వీణా మృదంగాల మధుర ధ్వనితో తెర ఎత్తగానే అభినేత్రి ప్రవేశించింది. గజ్జెల ధ్వనిలోని తరంగాలు ఆగిఆగి లేస్తున్నాయి. వేళ్ళు, మణికట్లు, నడుము, బాహు మూలలు అభినయం వలన దెబ్బ తింటున్నాయి. "చూడ దగిన సౌందర్యం ఈరోజే కన్పించింది; జీవితం సార్థకమయింది." అన్నారు ప్రజలు.

ఎంతోమంది సహృదయులు పొంగే హృదయాన్ని చేతితో అణచి పట్టుకొన్నారు. రసాస్వాదన వారికి ఆపదగా తయారయింది.

చిత్రకారుని భక్తుడైన ధనకుబేరుడు కూడ దగ్గరే కూర్చుని వున్నాడు. "రూపనాథ్! ఆమె సుందర వదనాన్ని చిత్రించి నాకు యివ్వగలవా?" అన్నాడతను.

చిత్రకారుడు అద్భుతమైన ప్రకాశాన్ని చూశాడు. 'కుంచె ఈమె సౌందర్యాన్ని చిత్రించగలదా?' అనుకున్నాడు. ఇంతలో అభినేత్రి అధరాలు కదిలాయి. నృత్యంవలన ఉఛ్వాస నిశ్వాసలు క్షణకాలంపాటు ఆగిపోయాయి. మురళి మోగింది. కవీశ్వరుని కంపిత స్వరతరంగాలు జ్యోతివలె నాలుగు మూలలకు ప్రసరించాయి. 'కళ' అని పిలిచాడు చిత్రకారుడు.

అతను కళ సజీవ చిత్రాన్ని చూశాడు. అతని స్వర కంపన జ్యోతి మండలంలో కలిసిపోయింది. అతను పిచ్చివానిలా అరుస్తూ "ఈ భావానికి నేను రూపాన్ని యివ్వలేను. నేను అసమర్థుడను" అంటూ లేచి వెళ్లిపోయాడు.

బీద రసదేవ్ కూడ వెనుక ఆసనంమీద ఒక మిత్రుని దగ్గర కూర్చున్నాడు. "రసదేవ్! ఈమె నీవు వ్రాసిన 'స్మృతి' అనే గీతాన్నే పాడుతున్నది. నీ రసమయ భావనమే ఈ స్వర్గీయ సంగీతానికి కేంద్రం. ఆత్మ వర్ణమాలను ధరించి జ్యోతిర్మయమైన నృత్యం చేస్తున్నట్లున్నది." అన్నాడు మిత్రుడు.

అది సంగీతానికి విశ్రాంతి సమయం. అభినేత్రి సంజ్ఞతో వీణా మృదంగాలను ఆపుజేసి, మూకాభినయనం ఆరంభించింది. తళతళ మెరిసే చీరకొంగును మాయాజాలంవలె చూపి, స్మృతియొక్క ప్రత్యక్ష అనుభవాన్ని సృష్టించింది. కవియొక్క మధురవాణి ఆమెకు వినిపించింది. "ఈమె-'నా దోషమే నీ రహస్యం, అందుకే ఎన్నో కల్పనల్లో నిన్ను వెదుకుతున్నాను; చూస్తున్నాను, ఓ నా చిరసుందరమా!"

అనే అర్థంగల ముఖ్యమైన అంతిమచరణం మరచిపోయింది.”
అన్నాడు కవి తన మిత్రునితో నవ్వుతూ.

ఆమె స్మృతి మేల్కొన్నది. ఆమె తృష్ణాపూరిత దృష్టితో, కవిని వెదకి తన మంగళ పుష్పముల - విజయ మాలను-దూరంగా నిలచిన ఆ బీద కవి పాదాలకు శ్రద్ధాంజలిగా అర్పించింది.

రసదేవుడు సగర్వంగా తలవంచాడు.

# శ్రీ ప్రేమ్‌చంద్

ప్రేమ్‌చంద్ బనారసు దగ్గర చిన్న గ్రామములో క్రీ॥ శ॥ 1887లో జన్మించారు. ఈయన అసలు పేరు 'ధనపత్ రాయ్'. మొదట్లో ద. ర. అనే పేరుతో కథలు వ్రాస్తుండేవారు. తర్వాత అనేక కారణాల వలన 'నవాబ్ రాయ్' అని పేరు పెట్టుకున్నారు. కాని, ఆయన ప్రేమపూరితమైన హృదయం, ఈ గర్వపూరితమైన పేరును త్యజించి 'ప్రేమ్‌చంద్' పేరును స్వీకరించింది.

ఈయనకు 'నవలా చక్రవర్తి' అని బిరుదు. దాదాపుగా 12 నవలలు, 300 కథలు, 3 నాటకాలు, అనువాదాలు వ్రాశారు. ఈయన కథలు, నవలలు, భారతీయభాషల్లోనేకాక, విదేశీయభాషలలో కూడ అనువదిస్తున్నారు.

ఈయన కథలు సరళంగా, గూఢమైన భావాలతో నిండివుంటాయి. ఈయన శైలి అందంగా, మనోరంజకంగా వుంటుంది. ఈయన కథల్లో బీద ప్రజల హృదయాలు ప్రతిబింబిస్తుంటాయి.

ఈ మహారచయిత క్రీ॥ శ॥ 1937 లో అకస్మాత్తుగా ఈ లోకాన్ని విడిచిపెట్టారు.

# నింద

—శ్రీ ప్రేమ్‌చంద్

తన యింట్లో కూర్చున్న మనిషి చక్రవర్తిని కూడ తిడుతూవుంటాడు. ఒక రోజున నేను యిద్దరు ముగ్గురు వ్యక్తులతో కూర్చుని, ఒక రాష్ట్రీయ సంస్థలోని వ్యక్తుల్ని విమర్శిస్తున్నాను. రాష్ట్రీయ కార్యకర్తలు స్వార్థానికి, లోభానికి దూరంగా వుండాలని మా వుద్దేశం. పవిత్రమైన ఉన్నతాదర్శాల వలననే దేశానికి నిజమైన సేవ చేయవచ్చును. చాలమంది కార్యకర్తల ఆచరణలు మమ్మల్ని కలత పెట్టాయి; అందుకనే యిప్పుడు మేము కూర్చుని మనస్సులోని ద్వేషాన్ని వెడలగక్కుతున్నాము. ఆ స్థితిలో మేము వుంటే యింకా పతనమై వుండవచ్చును: కాని యిప్పుడు మేము విమర్శకుల స్థానంలో వున్నాము, విమర్శకులే ఉదారులైతే న్యాయ మెవరు చేస్తారు? తనలో కూడ కొన్ని బలహీనతలు వున్నాయని విమర్శకులు మరచి పోవడంలో ఆలస్యమే వుండదు. విమర్శకుడు ఆ పరిస్థితులలో చిక్కుకొనక పోవడమో, చిక్కుకొని తన నేర్పరితనము వలన మచ్చలేకుండా తప్పించుకొనడమో జరుగుతుంది– ఇదే అతనిలోను, అపరాధిలోను వుండే అంతర్యం.

"క, మహాశయుడు పనిమాత్రం ఉత్సాహంగానే చేస్తాడు. కాని, లెక్కలు చూస్తే, ఒక వెయ్యికి తక్కువ లేకుండా ఆయనమీద వుంటుంది," అంది పద్మాదేవి.

"సరే, 'క'ను క్షమించ వచ్చును. అతనికి పిల్లా - జెల్లా వున్నారు; వాళ్ళను మాత్రం పోషించుకోవద్దా? అతను యిరవై నాలుగు గంటలు దేశసేవలోనే మునిగి వుంటున్నప్పుడు కొద్దో, గొప్పో దొరకాలిగా! అంత సమర్థుడు 500 రూపాయిలు జీతం యిచ్చినా దొరకడు. సంవత్సరం మొత్తం మీద ఒక వెయ్యి రూపాయిలు ఖర్చు చేయడం ఏంపెద్ద విషయం కాదు. 'ఖ' మహాశయుడు పూర్తిగా ఒంటరివాడు. పెళ్ళీ - పెడాకులు లేకుండా పరమాత్ముడు కావాలంటాడు. కాని, అతను కూడ వెయ్యికి తక్కువ తీసుకుని వుండడు. అతను బీదల డబ్బును కారులకోసం, స్నేహితుల విందులకోసం ఖర్చు చేస్తున్నాడేమని అడగడానికికూడ ఎవరికీ ధైర్యంలేదు." అంది ఊర్మిళాదేవి.

"గ, మహాశయుడే దీనికి సమాధాన మివ్వాలి యిలా తప్పించుకుంటూ పారిపోలేడు. వీరి విందుల కోసం, బ్రాంది బుడ్లకోసం, గానకచేరీల కోసమేనా మేమింతా భిక్షమెత్తి డబ్బు తేవటం? రోజూ సినిమాకు వెళుతుంటారు. బీదల సొమ్ము యిలా ఖర్చు చేయడానికి కాదు. సమ్మిడీ - దమ్మిడీ లెక్క చెప్పవలసి వుంటుంది. నిందు సభలోంచి తరిమి వేస్తాను. ఆయనకు ఐదువందల రూపాయిలు జీతం వచ్చే చోటుకే వెళ్ళమనండి. దేశసేవకు చాలమంది వస్తారు." అంది శ్యామాదేవి కోపంతో.

ఒకానొకప్పుడు నేనూ ఈ సంస్థకు నాయకుణ్ణిగా వున్నాను. నామీద ఎప్పుడూ ఇటువంటి నిందరానందుకు చాల

గర్విస్తుంటాను. కాని, ప్రజలు నా మంత్రిత్వాన్ని ఎందుకు హర్షించలేదో అర్థంకావు. కొద్దిసమయాన్నే నేను సంస్థకోసం వినియోగిస్తున్నానని, ఆస్వల్పకాలంలో సంస్థ అభివృద్ధి కార్యాలు సాగలేదని ప్రజల వుద్దేశం; అందుకే నేను కోపం తో రాజీనామా యిచ్చాను. నేను ఏవిధమైన స్వార్థ లేకుండా ఆ పదవిలో పని చేసినా గెంటబడ్డాను. "X" మహాశయుడు వేలకు వేలు మింగేసినా అదే పదవిలో పాతుకు పోయి వున్నాడు. ఆయనమీద నాకు ఈర్ష్య కలగడానికి ఈ కారణం చాలదు? నేను నేర్పరివైన ఆటగానిలా స్వయంగా ఏమీ చెయ్యకుండా తెరచాటునుంచి ప్రాడులాగు తుంటాను.

నెమ్మదిగా కలుగ జేసుకున్నాను – "మీరంతా అన్యాయం చేస్తున్నారు. "X" మహాశయుని కంటే ధైర్యవంతులు."

ఊర్మిళాదేవి నామాటను నిరాకరిస్తూ "ప్రజల సొమ్ము తో రహస్యంగా సారాసీసాల్ని ఖాళీచేసే మనుషుల్ని ధైర్య వంతులంటే నేను ఒప్పుకోను. మనము కాపలా కాసే కోట్ల దగ్గర నుండే వీరికి సారా బుడ్లు వస్తున్నాయి. యింత కంటే మోసం మరేముంటుంది.? యిటువంటి వాళ్ళు 'దేశద్రోహు' లంటాను నేను" అంది.

"కాని 'X' మహాశయుడు తన ప్రభావం వలన వేల కొలది రూపాయలు చందాల రూపంలో వసూలు చేస్తున్న సంగతి మీరుకూడా ఎరుగుదురుగదా! విదేశీయవస్త్రాల నిరోధం విషయంలో ఆయన్ని ఎంత గౌరవించినా చాలదు." అన్నాను నేను కొంచెం త్రాడు లాగుతూ.

ఊర్మిళాదేవి ఒప్పుకోదుగా! "ఆయనకు ఈ సంస్థ పేరు మీద చందాలు వసూలవుతున్నాయి, కాని వ్యక్తిగతంగా అర కాని కూడ దొరకదు. ఇక విదేశీయ వస్త్రాలంటారా? ప్రజలు. పేర్లను పూజిస్తున్నారు, మహాశయుణ్ని పొగుడుతున్నారు; కాని వాస్తవికంగా ఈ గౌరవం మనకు లభించ వలసింది. ఆయన ఎప్పుడూ ఏదుకాణం దగ్గరకు వెళ్ళలేదు. పట్టణమంతా యిదే అనుకుంటున్నారు. చందాకు వెళ్ళిన ప్రతిచోట యిదే ఆక్షేపిస్తున్నారు. ఎందరి నోళ్ళు నొక్కగలం? ఆయన జాతీయ సేవకుడిగానే కన్పిస్తుంటాడు, కాని వ్యభిచారుల కంటే కూడ నీచమైన పనులు చేస్తుంటాడు. ఇటువంటి భోగలాలసుల చేతి మీదుగా దేశోద్ధారణ జరగదు దానికి నిజమైన త్యాగం కావాలి." అంది.

## 2

ఇలా విమర్శలు జరుగుతుండగానే భగవతి అనే మరొక మహిళ, పాపం, చందాఅడగాలని, ఎంతో అలసి వచ్చింది. యిక్కడ తీర్పులు చూచి పుష్పాంగి పోయింది. ఆమెకు కూడ పది సంవత్సరాల కుమార్తె వుంది. ఈ కార్యాలలో ఎప్పుడూ తల్లి కూడానే వుంటుంది. ఆ అమ్మాయికి చాల ఆకలి వేస్తున్నది. యింటి తాళంకూడ భగవతీదేవి దగ్గరేవుంది. భర్తగారు ఆఫీసునుండి వచ్చి వుండొచ్చు, తలుపులు తీయాలి కనుక, ఆ బాలికను యింటికిచేర్చే పనిని నేనే స్వీకరించాను.

కొంతదూరం వెళ్ళిన తర్వాత "మహాశయుడు 'X' సారా త్రాగుతాడని మీకు తెలియదా?" అంది.

నేను ఈ నిందను సమర్థించలేదు. అమాయక బాలిక హృదయములో కఠోరత్వము గాని, ద్వేషము గాని, బూటక విషముగాని నాటడం నా ఈర్ష్యా ప్రకృతికి కూడ నచ్చలేదు. కోమలత్వము, సరళత్వము, విశ్వాసము, మాధుర్యము, వుండ వలసిన చోట, నింద, నీచత్వము - మోపి మర్యాదను పాడు చెయ్యడానికి ఎవరు యిష్టపడతారు? దేవతల మెళ్ళో ముళ్ళ దండను ఎవరు వేస్తారు?

"మహాశయుడు 'గ' సారా త్రాగుతాడని నీ కెవరు చెప్పారు?" అన్నాను.

"అయ్యో! మీ కేం తెలుసు?"

"నీ కెలా తెలుసు?"

"వూళ్ళో వాళ్ళంతా చెబుతున్నారు."

"వూళ్ళో వాళ్ళు అబద్ధం చెబుతున్నారు."

నేను కూడ 'గ' మహాశయుని బంధు - మిత్రులలో వాడి నన్నట్లుగా ఆ బాలిక అవిశ్వాస నేత్రాలతో నావంక చూసింది.

"మహాశయుడు 'గ' సారా త్రాగడం లేదని మీరు చెప్ప గలరా?"

"అవును. ఆయన ఎప్పుడూ త్రాగరు"

"అయితే, 'క' మహాశయుడు కూడ ప్రజల డబ్బు దోచుకోలేదంటారా?"

"యిది కూడ అబద్ధం"

"మహాశయుడు 'ఖ' కారులో షికారు చెయ్యడం లేదంటారా?"

"కారు మీద షికారుకు వెళ్ళడం పెద్ద అపరాధం కాదు."

"ప్రజల రక్తాన్ని పీడించే రాజులకు, ధనికులకు, ఆఫీసర్లకు, అపరాధం కాక పోవచ్చు; దేశ భక్తుల మని చెప్పుకునే వాళ్ళకు అది పెద్ద అపరాధం."

"కాని, వాళ్ళు ఎన్ని చోట్లు తిరగాలో ఆలోచించు. నడిచి ఎంత దూరమని వెళ్ళ గలరు?"

"సైకిలు మీద వెళ్ళ వచ్చు. అది పెద్ద విషయమేమీ కాదు. వీళ్ళు చాల గొప్ప వ్యక్తులని ప్రజలు అనుకోవాలని. వీళ్ళు దర్జా చూపిస్తున్నారు. మన సంస్థ బీదల సంస్థ. మరో విధంగా పని జరగకపోతే కారులో కూర్చోవాలి; ఇక, త్రాగుబోతులకు ఇక్కడ తావే లేదు. మీరు చందాలకు వెళ్ళడం లేదు. మాకు ఎంత సిగ్గుగా వుంటున్నదో, మీ కేం తెలుసు?"

"ఇది పూర్తిగా అబద్ధమని నువ్వు ప్రజలతో చెప్పాలి. మనమంతా ఈ సంస్థను అభివృద్ధి పరచాలనుకుంటున్నాము. మన కార్యకర్తల్ని మనమే అగౌరవ పరచడం మంచిది కాదు. వారు మనకు ఎంత సేవ చేస్తున్నారో, మనం ఆలోచించాలి. క, ఖ, గ లలో లోపాలు లేవని మాత్రం నేను చెప్పడం లేదు. లోపాలు వున్నవాళ్ళు లోకంలో ఎంతమంది లేరు? కాని, లోపాల్ని కప్పిపుచ్చడానికి వారిలో 'ఎన్ని గుణా

లున్నారో, మనం గమనించాలి. మనమంతా స్వార్థానికి ప్రాణాల్ని కూడ బలిచేస్తాము — యిళ్ళు కడతాము, ఆస్తిని పెంచుతాము. కనీసం యిళ్లల్లో విశ్రాంతిగా నిద్రపోతాము. పాపం! వాళ్లు యిరవై నాలుగు గంటలు దేశసేవలోనే మునిగిపోయి వుంటారు. ఈ గురువుగారు కూడ ఒక్కొక్క సంవత్సరము శిక్షను అనుభవించి, మొన్న మొన్ననే తిరిగి వచ్చారు. వీరి ప్రయత్నంవల్లనే ఆస్పత్రి, పుస్తకాలయము స్థాపించబడ్డాయి. వీరి ప్రయత్నం మీదే రైతుల పన్ను తగ్గించబడింది. ఒకవేళ వీరు సారాయి త్రాగాలనిగాని, డబ్బు సంపాదించాలని గాని, అనుకుంటే ఈ పనిలోకి ఎందుకు వస్తారు?" అన్నాను నేను గంభీరంగా.

బాలిక ఆలోచిస్తూ నావంక చూచి "మహాశయులు 'గ' సారా త్రాగుతాడా, లేదా? చెప్పండి." అంది.

"లేదు. అబద్ధం." అన్నాను దృఢంగా.

భగవతీదేవి నా యిల్లు వచ్చింది. బాలిక వెళ్ళిపోయింది. ఈ రోజు అబద్ధం చెప్పి సంతోషించు వంతగా, నిజం చెప్పినప్పుడు కూడ సంతోషించలేకపోయాను. నిర్మల హృదయంగల ఒక బాలికను, నిందలతో కూడిన బురదలో పడిపోకుండా రక్షించాను.

# శ్రీ జైనేంద్ర కుమార్

శ్రీ జైనేంద్ర కుమార్ ఢిల్లీలో 'జైన్' కుటుంబములో జన్మించారు. వీరు యిరవై సంవత్సరాల నుండి సాహిత్యసేవ చేస్తున్నారు. హిందీలోని వుత్తమ కథా రచయితలలో వీరొకరు. వీరి కథలు పాశ్చాత్య కథల పంథాలో నడుస్తుంటాయి. ఒక భావాన్ని గాని, ఒక దృశ్యాన్ని గాని పాఠకుల హృదయాలలో హత్తుకునేలా, కళ్ళకు కట్టినట్లు వర్ణించడంలో జైనేంద్ర కుమార్ సిద్ధహస్తులు. వీరి కథల్లో కథా వస్తువుకు గాని, ఘట్టానికి గాని ఎక్కువ ప్రాధాన్య ముండదు; భావానికే ప్రాధాన్య ముంటుంది.

వీరి కథలు, నవలలు చాలా భాషలలోకి అనువదించబడ్డాయి. వీరి రచనలు మనోవిజ్ఞానానికి ఎక్కువగా వుపయోగపడతాయి.

# ఎవరి అదృష్టం వారిది

మూలం : శ్రీ జైనేంద్ర కుమార్.

పూరకే చాలాసేపు తిరిగి రోడ్డుకు ప్రక్కనున్న ఒక బెంచీ మీద కూర్చున్నాము.

నైనీతాల్ యొక్క సంధ్య నెమ్మదిగా దిగ జారుతూ వుంది. ఆవిరితో తయారయిన మేఘాలు మా తలలను తాకుతూ నిరాటంకంగా తిరుగుతున్నాయి. లేత కాంతులు చీకటిలో మిశ్రితమై ఒక్కొక్కప్పుడు నీలి వర్ణంగాను, మరొకప్పుడు ధవళ వర్ణంగాను, తిరిగి కొంతసేపట్లో అరుణ వర్ణంగాను మారుతున్నాయి. అవి మాతో కేరింతాలు కొట్టాలను కున్నట్లుగా కన్పిస్తున్నాయి.

వెనుకతట్టున మా 'పోలోవాలా' మైదానముంది. ముందువైపు ఆంగ్లేయుల ప్రమోద గృహ మొకటివుంది. అక్కడ మనోహరమైన మధుర వాయిద్యాలు మ్రోగుతున్నాయి, ప్రక్క రమ్యాతి రమ్యమైన నైనీతాల్ వుంది.

చెరువులో 'కిస్తీ'లు తెల్లటి తెరచాపను ఎగరవేసుకుంటూ యిద్దరు ముగ్గురు ఆంగ్లేయ యాత్రికులతో అటు, యిటు తిరుగుతున్నాయి; ఒకచోట కొంతమంది ఆంగ్లేయులు ఒక్కొక్క శ్రీమతిని ఎదురుగా వుంచుకొని, సూదివంటి ఆకారం గల తమ చిన్న నావలను పందెం కట్టినట్లు పరుగెత్తిస్తు

న్నారు; వేరొక చోట కొంతమంది మహాశయులు ఒడ్డున కూర్చుని గాలాన్ని నీటిలో వేసి, ధైర్యంగా, ఏకాగ్రతతో చేపల్ని పడుతున్నారు.

వెనుకతట్టున పోలో-గ్రౌనులో పిల్లలు కేరింతాలు కొడుతూ హాకీ ఆడుతున్నారు. గోలచేయడం, కొట్టుకోవ డం, తిట్టుకోవడం కూడ ఆటలోని భాగాలవలెనే వున్నాయి. ఈ ఆటంతా తాత్కాలిక వుద్దేశ్యమైనా, ఆ బాలకులు తమ మనస్సును, దేహాన్ని, సమగ్రబలాన్ని, పూర్ణవిద్యను వినియో గించి పూర్తి చేయాలను కుంటున్నారు. వాళ్ళకు ముందు వెను కల ఆలోచన లేదు. వాళ్ళు కేవలం తాత్కాలిక ప్రాణులు. వాళ్ళు శబ్దంలోని సంపూర్ణ సత్యంతో జీవిస్తున్నారు.

రోడ్డుమీద స్త్రీ పురుషుల తెంపులేని గుంపు నస్తూ పోతూ వుంది. దానికి మొదలు చివరు లేదు. ఈ ప్రవాహం ఎక్కడనుండి వస్తుందో, ఎక్కడకు పోతుందో ఎవరికీ తెలి యదు. నుచ్చుకు మనుష్యుల బజారు అలంకరించి, వయ్యా రంగా, తీసుకెళుతున్నట్లుగా అందులో రకరకాల వయస్సులు గల మనష్యు లున్నారు.

అందులో అధికార గర్వంతో మిడిసిపడే ఆంగ్లేయు లున్నారు; తమ గౌరవ ప్రతిష్ఠలను అణచుకుని, అతి నైపు ణ్యంతో శోక నాడించడం నేర్చుకున్న కొంతప్రజలు, చింపిరి పేలికలతో అలంకరించిన గుర్రం కళ్ళెం పట్టుకుని వున్నారు.

పరుగెత్తుతూ, నవ్వుతూ, ఆడుతూ, కొంటెపనులు చేస్తు న్న ఎర్రటి ఆంగ్లేయ బాలు రున్నారు; పసుపుపచ్చని కళ్ళను

విప్పాకుని తండ్రివ్రేలు పట్టుకుని నడుస్తున్న మన భారతీయ బాలుడుకూడ వున్నారు.

తమ పిల్లలతో పరుగెత్తుతు, నవ్వుతు, ఆడుతున్నారు ఆంగ్లేయులు. పూర్వాచారాల్ని తమ నాలుగు వైపుల చుట్టుకుని, ధనిక లక్షణాల్ని ప్రదర్శిస్తూ నడుస్తున్నారు భారతీయ పితృదేవతలు.

ఆంగ్లేయ మహిళలు చురుగ్గా నడుస్తున్నారు. వాళ్ళకు నడవటంలో అలసటగాని, నవ్వడంలో సిగ్గుగాని కలగదు. కసరత్తు పేరుచెప్పి గుర్రాల మీదకూడ ఎక్కుతారు; గుర్రంతోపాటు యింకా యిష్టమయితే ఏ భారతీయుని మీదనైనా కొరడా విసురుతారు. వాళ్లు యిద్దరిద్దరుగాను, ముగ్గురు ముగ్గురుగాను, నలుగురు నలుగురుగాను నిరాటంకంగా, నిశ్శంకతో ఈ మహాప్రవాహంలో తమ స్థానం తెలుసునన్నట్లు రోడ్డుమీదనుండి వెళుతున్నారు.

ఇటు మన భారతీయ కులస్త్రీలు బాటకు బాగా ఒడ్డున, పైట కొంగును సవరించుకుంటూ, లోక మర్యాదను, స్త్రీత్వమును, భారతీయ ఉన్నతోన్నత అదర్శములను తమ చీర మడత ఆవరణలలో ముడుచుకుని, కళ్ళను భూమిలో గ్రుచ్చి, భయంతో అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్నారు.

## 2

కొన్ని గంటలు గడచి పోయాయి. గాఢాంధకారం అలుముకుంది. మేఘాలు తెల్లగా మారి తోడుకు పోయాయి.

మనుష్యుల గుంపు మెల్ల మెల్లగా తగ్గిపోయింది. ఒక రిద్దరు మనుషులు మాత్రం గొడుగులు వేసుకుని పోతున్నారు. మేము అక్కడే కూర్చుండి పోయాం. చలి వేస్తున్నది. మా ఓవర్ కోట్లు తడిచి పోయాయి.

వెనకకు తిరిగి చూశాను. ఆ లైను మంచు దుప్పటివలె పూర్తిగా స్థంభించి, నిశ్శబ్దంగా వుంది.

అంతా ప్రశాంతగా వుంది. తల్లీతాల్ విద్యుత్ కాంతులు దీపావళిలా ప్రకాశిస్తున్నాయి. ఆ ప్రకాశము రెండు మైళ్ళ వరకు వ్యాపించివున్న ప్రకృతి జలదర్పణం మీద ప్రతి బింబిస్తున్నది. కెరటాల అలజడిలో దర్పణం కదులుతూ వుండటం వలన ఆ స్థలం, ఆ ప్రతిబింబాన్ని వందరెట్లు-వెయ్యి రెట్లు చేసి, ఆ ప్రకాశాన్ని ప్రోగుచేసి, నాలుగు వైపుల వ్యాపింప జేస్తున్నట్లుగా వుంది. పర్వత శిఖరాలపై నున్న ప్రకాశము నక్షత్రాల వలె కన్పిస్తున్నది.

మేము చూస్తుండగానే ఒక దట్టమైన తెరవచ్చి వీట న్నింటినీ కప్పివేసింది. కాంతులు కరిగి పోయినట్లుయింది. మెరుపులు మాయమై పోయాయి. ఆ నల్లటి భూతం వలన పర్వతాలు కూడ ఈ తెల్ల తెర వెనుక మరుగు పడి పోయాయి. దగ్గర వస్తువు కూడ కన్పించడంలేదు. ఒక భయం కరమైన ప్రళయంవలెవుంది. అన్నీ ఈ లోతులోను, తెలుపు లోను అణగి పోయాయి. ఒక శుభ్రమైన మహా సాగరం వ్యాపించి సృష్టిలోని అస్తిత్వాన్ని ముంచి వేసినట్లుంది. పైన, క్రింద,

నాలుగు వైపుల నిర్భేద్యమైన తెల్లని శూన్యత్వమే వ్యాపించి వుంది.

ఇంతటి దట్టమైన మంచు మే మేప్పుడూ చూడలేదు. "టప్ - టప్" అంటూ పడుతూ వుంది.

ఇప్పుడు పూర్తిగా, ప్రశాంతంగా వుంది. ఆ ప్రవాహ మంతా ఏ గూళ్ళలో దాక్కొందో అర్థంకాదు.

అతి శుభ్రమైన ఆ శూన్యంలో ఎక్కడనుండో "టంగ్-టంగ్" మంటూ పన్నెండు కొట్టింది. ఎక్కడో దూరంలో నున్న గోరీ దగ్గరనుంచి శబ్దం వచ్చినట్లయింది.

మేము మా హోటళ్ళకు బయలు దేరాము.

## 3

త్రోవలో యిద్దరు స్నేహితుల హోటళ్లు వచ్చాయి. మిత్రులయిన యిద్దరు వకీళ్ళు సెలవు తీసుకుని వెళ్ళిపోయారు. మే మిద్దరం ముందుకు నడిచాము. మా హోటలు యింకా ముందు వుంది.

చెరువు ఒడ్డునే మేము వెళుతున్నాము. మా ఓవరు కోట్లు తడచిపోయాయి. వర్షం రావడంలేదు. కాని చలి ఎక్కువగా వుండటం వలన కోటుపైన మరొక కంబళీవుంటే, ఎంతో బాగుండు ననుకున్నాము.

త్రోవలో చెరువు ఒడ్డునే ఒక బెంచీవుంది. వెంటనే హోటలుకు వెళ్ళి తడిచిపోయిన ఈ బట్టలు విప్పి, వేడి పరుపులో దాక్కొని నిద్రపోవాలని నాకు మనస్సులో ఎం

ఆత్రుతగా వుంది. కాని, కూడావున్న మిత్రునికి ఏ సమయా నికి ఏ ఆలోచన పుడుతుందో, ఎలా పుడుతుందో అర్థంకాదు. అది ఎలావుంటుందో, ఏమై వుంటుందో కూడ అంచనా వేయ డం కష్టం.

"రా, కొంచెం యిక్కడ కూర్చుదాం." అన్నాడాయన.

ఆ కురుస్తుండే మంచులో, రాత్రి సరిగ్గా ఒంటిగంటకు, చెరువు ఒడ్డున. మంచులో తడిచి చల్లగా అయిపోయిన యినుప బెంచీమీద కూర్చుండి పోయాము.

ఐదు-పది-పదిహేను నిమిషాలు గడిచిపోయాయి. మిత్రుడు యింకా లేచే వుద్దేశంలో లేడు.

"పదండి..." అన్నాను కొంచెం విసుగ్గా.

"కూర్చోవయ్యా........"

చెయ్యి పట్టుకుని బలవంతంగా కూర్చోబెట్టేసరికి మరొక వుపాయమే లేకపోయింది. ఆయన మాటను త్రోసి వేయడం సులువైన పని కాదు; పోనీ 'కొంచెం కూర్చోవడ మైనా' చిన్న విషయం కాదు.

వూరకనే కూర్చుని విసుగెత్తి లోలోపల మండి పడు తున్నాను. యింతలో మిత్రుడు "చూశావా అదేమిటో?" అన్నాడు.

నేను దృష్టిని అటువైపుకు మళ్ళించాను. కొన్నిగజాల దూరంలో, తెల్లని మంచులోంచి ఒక నల్లని మూర్తి మా వైపుకే వస్తూవుంది. "ఎవరో!" అన్నాను.

ఒక పిల్లవాడు పొడవైన తల వెంట్రుకల్ని గోక్కొంటూ వస్తున్నట్లుగా మూడు గజాల దూరంలో కన్పించాడు. కాళ్ళకు జోళ్ళు లేవు, తలమీద ఏమీ లేదు, మురికి చొక్కా తొడుక్కొన్నాడు.

అతని కాళ్లు ఎక్కడ పడుతున్నాయో, అతను ఎక్కడకు వెళుతున్నాడో - ఎక్కడకు వెళ్ళాలనుకుంటున్నాడో, తెలియదు. కుడి ఎడమల భేదమే లేదు.

దగ్గరలో వున్న గాటీ లైటు మసక కాంతిలో చూశాను... ఏదో, పదిసంవత్సరాలుండొచ్చు. తెల్లని రంగు, కాని మురికివలన నల్లగా అయిపోయాడు; కళ్ళు అందమయినవి, పెద్దవి; కాని శూన్యంగా వున్నాయి. అప్పుడే తల ముడతలు పడి పోయినట్లుంది.

అతను మమ్మల్ని చూడలేదు. క్రింది భూమినిగాని, పైన నాలుగువైపుల వ్యాపించిన మంచునుగాని, ఎదురుగా వున్న చెరువునుగాని, ఒంటరితనాన్ని గాని - అసలు అతను ఏమీ చూస్తున్నట్లే లేదు. అతను కేవలం తన దగ్గర్లో వున్న వర్తమానాన్ని చూస్తున్నాడు.

"ఏయ్!" అన్నాడు మిత్రుడు.

అతను శూన్యమైన తన కళ్ళను విప్పాడు.

"లోకమంతా నిద్రపోతున్నది, నువ్వు ఎందుకు తిరుగుతున్నావ్?"

బాలకుడు మాట్లాడుతున్నట్లే మౌనంగా ఖిన్నుడై నిలబడాడు.

"ఎక్కడ పడుకుంటావ్ ?"
"ఇక్కడే,...ఎక్కడో..."
"నిన్నెక్కడ పడుకున్నావ్ ?"
"దుకాణంలో."
"యివ్వాళకూడ అక్కడే పడుకోకూడదను ?"
"నౌకరీలోంచి తీసేశారు."
"ఏం నౌకరీ ?"
"అన్ని పనులు..."
"ఏం యిచ్చారు ?"
"ఒక రూపాయి, ఎంగిలిమెతుకులు."
"మళ్ళీ నౌకరీ చేస్తావా ?"
"ఊఁ..."
"బయటకు వస్తావా ?"
"ఊఁ..."
"యివ్వాళ ఏం తిన్నావ్ ?"
"ఏమీలేదు."
"యిప్పుడు తినడానికి దొరుకుతుందా ?"
"దొరకదు."
"యిలాగే పడుకుంటావా ?"
"అవును..."
"ఎక్కడ ?"
"ఇక్కడే,...ఎక్కడో."
"ఈ బట్టలతోనే ?"

పిల్లవాడు మళ్ళీ కళ్ళతో మాట్లాడి మౌనం వహించాడు. "ఎంత మూర్ఖపు ప్రశ్న!" అంటున్నట్లున్నాయి అతని కళ్లు.

"అమ్మ, నాన్న వున్నారా?"

"వున్నారు."

"ఎక్కడ ?"

"ఇక్కడకు పదిహేను క్రోసుల దూరంలో...."

"నువ్వు పారిపోయి వచ్చావా ?"

"అవును."

"ఎందుకు ?"

"నాకు తమ్ముళ్లు చెల్లెళ్ళు చాలమంది వున్నారు—అందుకే పారిపోయి వచ్చాను. అక్కడ పనీలేదు, కూడూ లేదు. నాన్న ఆకలితో వుంటాడు. అమ్మ ఆకలితో వుంటూ ఏడుస్తుంటుంది. అందుకు పారిపోయి వచ్చాను. ఆ గ్రామం వాడే మరొక స్నేహితుడున్నాడు, నాకంటే పెద్దవాడు. యిద్దరం కలసే యిక్కడకు వచ్చాము. అత నిప్పుడు లేడు."

"ఎక్కడ కెళ్ళాడు ?"

"చచ్చిపోయాడు."

ఇంత చిన్న వయస్సులోనే యితనికి చావంటే తెలిసిపోయింది !—నాకు ఆశ్చర్యం కలిగింది, "చచ్చిపోయాడా ?" అని రెట్టించాను.

"అవును. బాబుగారు కొట్టారు, చచ్చిపోయాడు."

"సరే, మాతో రా."

అతను మాతో బయలుదేరాడు. మేము వకీలు మిత్రుని హోటలుకు చేరాము.

"వకీలుగారు!"

వకీలుగారు హోటలు గదిలోంచి బయటకు వచ్చారు. మేజోళ్ళు తొడుక్కొన్న కాళ్ళకు జోళ్లు వేసుకుని, కాశ్మీరు శాలువా శరీరాన్నంతా చుట్టబెట్టుకున్నారు. స్వరంలో కొంచెం విసుగు, నిర్లక్ష్యంకూడ ధ్వనిస్తున్నది.

"ఓహో! మళ్ళీ, తమరేనా? ఏం?"

"మీకు నౌకరు కావాలిగా! చూడండి ఈకుర్రాడిని"

"ఎక్కడ నుంచి తీసుకొచ్చారు? – యితన్ని మీరు ఎరుగుదురా?"

"ఎరుగుదును – ఇతను నమ్మకంగానే వుంటాడు."

"ఏమో! వీళ్ళు పర్వతపు పశువులు. ప్రతి కుర్రాడిలోను కల్మషం నిండి వుంటుంది. మీరూ విచిత్రమైన మనుషులేనే – ఎక్కడనుంచో తీసుకొచ్చి – ఈ నౌకర్ని తీసుకోమంటారే!"

"నామాట నమ్మండి. ఈపిల్లవాడు చాల మంచివాడు.

"మీరు కూడ బలే వారండీ! ముక్కూ మొఖం ఎరుగని వాళ్ళని నౌకర్లగా పెట్టుకుంటే, మర్నాడే కావలసిన వన్నీ తీసుకుని మాయ మవుతాడు."

"మీరు ఒప్పుకోక పోతే, నేనేం చెయ్యను?"

"ఏమిటి ఒపుకోవాలి?– మీరుకూడ... బలే ఎగతాళి చేస్తున్నారు! సరే, నేను వెళ్ళి పడుకుంటాను."

ఆయన రోజుకు నాలుగు రూపాయల అద్దెగల గదిలో దోమ తెర లోపల పవళించడానికి వెళ్ళిపోయారు.

## 4

వకీలు గారు వెళ్ళిన తర్వాత, హోటలు బయటకు వచ్చి, మిత్రుడు తన జేబులో చెయ్యి పెట్టి, ఏదో వెదికి నిరాశతో చెయ్యి బైటకు తీసి నా వంకచూడ నారంభించాడు.

"ఏమిటి?" అన్నాను.

"ఇతని తిండికోసం ఏమైనా యిద్దామను కున్నాను. కాని పది రూపాయల నోట్లు వున్నాయి." అన్నాడుమిత్రుడు యింగ్లీషులో.

"నా జేబులో కూడ నోట్లే వున్నాయను కుంటాను – చూడనా?"

నిజంగా నా జేబులో కూడ నోట్లే వున్నాయి. మేము యింగ్లీషులో మాట్లాడు తున్నాము. చలి తీవ్రంగా వుండడం వలన పిల్లవాడి పళ్ళు కొట్టుకుంటూ వున్నాయి.

"అయితే, ఏం చేద్దాం?" అన్నాడు మిత్రుడు.

"పది రూపాల నోటే యివ్వండి" అన్నాను.

ఆశ్చర్యంగా మిత్రుడు నా ముఖం వంక చూచి "మిత్రమా! బడ్జెట్టు లోటవుతుంది. నాహృదయంలో ఎంతో దయ వుంది; కాని దగ్గర డబ్బులు లేవు." అన్నాడు.

"పోనివ్వండి. ఈ రోజులలో ఈదయే చాలు." అన్నాను.

మిత్రుడు మాట్లాడ లేదు. ఏదో ఆలోచిస్తున్నట్లుంది. కొంత సేపైన తర్వాత "యివ్వాళ ఏమీ లేదు. రేపుకలుసుకో ఆ. "ది. పవ్. హోటలు" ఎరుగుదువా? అక్కడే రేపు పది గంటలకు కలుసుకో" అన్నాడు.

"ఆలాగే! ఏమైనా పని చూపిస్తారా?"

"ప్రయత్నిస్తాం."

"అయితే, పొమ్మంటారా బాబు?" పిల్లవాడు ఆశాని రాశలతో అడిగాడు.

"ఆc." అంటూ చల్లటిసిట్టూర్పును విడిచి "ఎక్కడ పడుకుంటావ్?" అన్నాడు మిత్రుడు.

"ఇక్కడే, ఎక్కడో!- బెంచీమీదో, చెట్టు క్రిందో, దుకాణం పొయ్యిదగ్గరో!"

పిల్లవాడు కొంచెం ఆగాడు. నేను సందిగ్ధంలో పడ్డాను. అప్పటికే అతను గబగబ ఒక వైపుకు వెళ్ళి మంచులో కలిసి పోయాడు. మేము కూడా హోటలు వైపుకు బయలుదేరాము. గాలి తీక్షణంగా వుంది - మా కోటుల్ని దాటి శరీరంలో బాణంలా గ్రుచ్చుకొంటున్నది.

మిత్రుడు వణుకుతూ అన్నాడు "చలిచాల భయం కరంగా వుంది. అతని దగ్గర కొద్ది - చాల కొద్ది బట్టలు....."

"ఇది ప్రపంచం మిత్రమా! పదండి, ముందు పరుపులో శరీరాన్ని వేడి చేసుకుని, తర్వాత ఎవరి గురించయినా ఆలోచించవచ్చు." అంటూ నేను స్వార్థ పూరిత మైన ఫిలాసఫీ మొదలు పెట్టాను.

"స్వార్థం!- ఏమైనా చెప్పు; గత్యంతరం లేదను, క్రూరత అను - సిగ్గులేని తనమను." మిత్రుడు ఉదాసీనతతో అన్నాడు.

మర్నాడు, స్వర్గమనుకునే నైనీతాల్‌లోని ఒక బానిస పశువుయొక్క ఆ ముద్దుల పుత్రుడు——ఆ పిల్లవాడు, అనుకున్న సమయానికి మా "హోటల్-డి-పవ్"కు రాలేదు. మేము మా నైనీతాల్ షికారును ఆనందంగా గడిపి బయలు దేరడానికి సిద్ధంగా వున్నాము. ఆ పిల్లవాడికోసం ఎదురుచూస్తూ కూర్చోవలసిన అవసరం మాకేమీ కన్పించలేదు.

కారులో బయలుదేరేసరికి "గడచిన రాత్రి, పర్వత ప్రాంతానికి చెందిన ఒక బాలకుడు రోడ్డుప్రక్క——చెట్టుక్రింద ముడుచుకొని, చనిపోయాడు." అని వార్త వచ్చింది.

చనిపోడానికి అతనికి అదేస్థలం, ఆ పదిసంవత్సరాల వయస్సు, ఆ నల్లని చినిగిపోయిని కమీజు దొరికాయి. మానవ లోకం ఈ కానుకే అతనికి విడిచిపెట్టింది కాబోలు !

దౌర్భాగ్యుని ముఖానికి, ఛాతీకీ, పిడికిలికీ, కాళ్ళకు పల్చటి మంచుదుప్పటి అంటుకుపోయిందని అనేవాళ్ళు

అన్నారు. ప్రపంచపు సిగ్గులేని తనాన్ని కప్పిపుచ్చడానికి ప్రకృతియే ఆ శవానికి తెల్లని చల్లని గుడ్డను ఏర్పాటుచేసి నట్లున్నది.

అందరూ విన్నారు, ఆలోచించారు.

—"ఎవరి అదృష్టం వారిది."

(5)

# శ్రీ సుదర్శన్

శ్రీ సుదర్శన్ క్రీ. శ. 1896లో స్యాలకోట్ (పంజాబ్) లో జన్మించారు. ఆయన బాల్యము నుండీ కథలు వ్రాస్తూనే వున్నారు. హిందుస్తాని, భారత్, చంద్ర, ఆర్య పత్రిక మొదలైన ఉర్దూ పత్రికలకు సంపాదకులుగా కొంతకాలం పని చేశారు. ఉర్దూలో దాదాపు 40 పుస్తకాలు వ్రాశారు; హిందీలో నాటకాలు, కథల సంపుటలు సుమారు 20 వరకు వుంటాయి.

ఆయన కథలు స్వాభావికంగా, మనోరంజకంగా వుంటాయి. భాష, శైలి సరళంగా వుండటంవలన; కథ చదువుతుంటే, అందులోని ఘట్టాలు కళ్ళకు కట్టినట్లుంటాయి.

శ్రీ సుదర్శన్ వ్రాసిన అనేక కథలు భారతదేశములోని అనేక భాషలలో అనువదించబడ్డాయి. ఆయన వ్రాసిన "సికిందర్" "భాగ్యచక్ర" అనే నాటకాలు చాల ప్రసిద్ధి కెక్కాయి. వీటిని ఫిల్ములుగా కూడ తీశారు. కాని, కొన్ని సంవత్సరాల నుండి ఆయన సినిమాలకు కథలు వ్రాస్తుండటం వలన, ఈ మధ్య ఆయన క్రొత్త గ్రంథాలేమీ వెలువడినట్లు లేదు.

# కవి భార్య

మూలం : శ్రీ సుదర్శన్.

సత్యవాన్ -

విద్యార్థిదశలో నేను మణిరామ్ కలసి చదువుకునే వాళ్ళం. అప్పుడు పరస్పరం ప్రాణాలు ఇచ్చుకునేవాళ్ళం. చిన్నతనపు రోజుల్లో ఒకరి నొకరు చూచుకోనకపోతే శాంతి వుండేదికాదు. అప్పుడు అంతగా తెలిసేదికాదు. తర్వాత ప్రేమపీఠాన్ని వైరం ఆక్రమించింది; యిద్దరం పరమ విరోధుల మయ్యాము. అప్పటికి మాకు జ్ఞానం వచ్చింది. ఎఫ్. ఎ. పరీక్ష ప్యాసయిన తర్వాత మా త్రోవలు వేరైనాయి. మణిరామ్ మెడికల్ కాలేజీలో చేరాడు. నేను సాహిత్యరంగంలో అడుగు పెట్టాను. నాకు డబ్బుకు లోటులేదు. ప్రాప్యాలు విడిచిపెట్టిన ఆస్తి ఈ విషయంలో దిగులులేకుండా చేసింది. రాత్రింబవళ్ళు కవిత్వంలో లీనమై ఎన్నోరోజులు యింటినుంచి బయటకుకూడ వెళ్ళేవాడిని కాదు. ఒక్కొక్క పద్యానికి కొన్నిగంటలు గడచి పోయేవి. నా రచన్ని చూచి గర్వంతో పొంగిపోయేవాడిని. అప్పుడప్పుడు నా కవిత్వంలో తులసీదాసు ఉదాహరణలు, సూరదాసు రూపకాల మాధుర్యం వస్తుండేది. కాని, నా కవితలు పత్రికల్లో ప్రచురించ బడినప్పుడు, నా కవిత్వ మదము దిగ నారంభించింది, క్రమంగా దిగిపోయింది; కాని దాని ప్రభావం పోలేదు. ఈ ప్రభావం ప్రఖ్యాతి, కీర్తుల ప్రభావం,

కొద్దికాలంలోనే నా పేరు సాహిత్య (హిందీ) ప్రపంచంలో ప్రసిద్ధికెక్కింది. ఇప్పుడు నేనేమీ పని చేయడంలేదు. కేవలం పెద్ద పెద్ద వాళ్ళకు విందులుమాత్రం యిస్తున్నాను. యిప్పుడవి లేకుంటే, నాకు ఆనందంగా వుండదు. కవిత్వంలోకూడ అంతగా మనస్కరించడం లేదు. మొదట్లో నా సమయమంతా దీనికే అర్పించేవాడిని; ఇప్పుడది వినోదవస్తువై పోయింది. కాని, ఎప్పుడైనా, ఏమైనా వ్రాయాలనుకుంటే మాత్రం సువర్ణ మయం చేస్తున్నాను. సాధారణ విషయాన్ని తీసుకున్నా, దానికి ప్రాణం పోస్తున్నాను.

అటు మణిరామ్ వైద్య గ్రంధాలతో తల బద్దలు కొట్టుకొని, అయిదు సంవత్సరాల తర్వాత అసిస్టెంటు సర్జన్ పరీక్ష ప్యాసయి, ఒక వైద్యశాల పెట్టాడు. పరీక్షా ఫలితాలు వెలువడే టప్పుడు మాత్రం అతనిపేరు ఒక్కసారి పత్రికలలో ప్రకటింప బడింది. ఇటు నన్ను పొగడ్డంలో ప్రతిదినం సమాచార పత్రికల పేజీలు నిండిపోతున్నాయ్. అతను వైద్యశాలలో పగలంతా కూర్చుని రోగులకోసం నిరీక్షిస్తుంటాడు. కాని, అతనిపేరు ఎవరెరుగుదురు ? ప్రజలు అటు పోవడానికే విసుక్కుంటారు. కారులో పోయే మనిషి కాలినడకను పోయే వాడిని చూచి అసహ్యించుకొన్నట్లుగా, నేను అతనివైపు చూచి నప్పుడు అసహ్యంతో ముఖం తిప్పుకొంటాను.

## 2

ఒక రోజున ఒకవుత్తరం వచ్చింది. అందులో నాకవిత్వ కళను గురించి ఎక్కువగా పొగుడుతూ నేను దేశానికి, జాతికి

గౌరవనీయునిగా వ్రాశారు. ఇది క్రొత్త విషయమేమీ కాదు, యిటువంటి ఉత్తరాలు నాకు తరచు వస్తుంటాయి. అప్పుడప్పుడు యిటువంటి ఉత్తరాల్ని చూస్తే విసుగు వేస్తుంది. కాని, ఈ ఉత్తరం ఒక స్త్రీ దగ్గర నుంచి వచ్చింది. మనం, పురుషుల దగ్గరనుండి వస్తే ఉపేక్షించగలము! కాని ఒక కోమలాంగితో యిలా వ్యవహరించడానికి మనస్కరించదు. అదీగాక ఈ ఉత్తరం మామూలు స్త్రీ దగ్గరనుండి రాలేదు. దీని రచయిత్రి డెహరాడూన్ లోని ప్రసిద్ధ జమీందారు ఠాగూర్ హృదయనారాయణగారి పుత్రిక సావిత్రి, ఆమె ఈ సంవత్సరమే బి. ఎ. పాసయింది. ఆమెను గురించి సమాచార పత్రికల్లో అనేక వ్యాసాలు వెలువడినయ్; కాని నేను వాటిని చదువలేదు. ఈ ఉత్తరం వలన అన్నీ జ్ఞాపకం వచ్చాయి. వెంటనే కలం తీసుకొని, జవాబు వ్రాయడానికి కూర్చున్నాను. కలం చాల జోరుగా నడుస్తున్నది. ఇంత నిమగ్నతతో ఏ విద్యార్థికూడ తన పరీక్ష పేపర్లయినా వ్రాయడు. ప్రతి శబ్దం దగ్గర ఆగి, క్రొత్త శబ్దాల్ని వెదకి, నూతన భావాలతో కలానికి అర్పించాను. సావిత్రిని గురించి, ఆమె పాండిత్యం గురించి ప్రశంసిస్తూ, నిఘంటువులోని సుందర శబ్దాలనన్నీ పూర్తిచేశాను. నా అయోగ్యతనుకూడ అంగీకరించాను – "మీరు నన్ను పొగుడుతున్నారు, యిది మీలోని గొప్పతనం; లేకపోతే నా కవిత్వంలో ఏముంది? కల్పనలో సొంపులేదు, శబ్దాలలో మాధుర్యం లేదు. రసం, కవిత్వానికి ముఖ్యాంగం; అదే నా కవిత్వంలో లోపిస్తుంటుంది. మనం కవిగా 'తయారై' కూర్చుంటాము, కాని, కవి 'అవడం

చాలకష్టం. దీనికి చూచే కళ్ళు, వినేచెవులు - రెండూ అవసరమే.” యింకా....యింకా...

తనకు తాను పొగుడుకోడానికి యిదొక మంచి పద్దతని వేరే చెప్పనవసరం లేదు.

కొన్ని రోజులలో ఈ వృత్తరానికి సమాధానం వచ్చింది. “మీరు వ్రాసింది, మీ వంటి మహాపురుషులకు యోగ్యమైనదే కాని నేను మాత్రం మిమ్మల్ని ‘టెనిసన్’ ‘వర్డ్సువర్త్’ల కంటే ఎక్కువగా భావిస్తున్నాను. మీ కవిత్వం రసహీనమైనదని మీ రంటున్నారు; కావచ్చు. కాని, అది నన్ను ముగ్ధురాలిని చేస్తున్నది. అనేక గంటలు ప్రేమ సాగరంలో ముంచి తేలుస్తున్నది. తిండి కూడ మరచి పోతున్నాను. మీ కలాన్ని ముద్దుపెట్టుకోవాలని పిస్తున్నది.”

ఈ వృత్తరం మరొక మదిర పాత్రగా తయారయింది. ఆఖరు వాక్యం హృదయంలో మంటలు లేపింది. నేను తిరిగి జవాబు యిస్తూ, వృత్తరంలో హృదయాన్ని విప్పి వ్రాశాను. కవి, తను కోరేవారిని ఆకాశం మీదకు ఎత్తుతాడు. నేను కూడ సావిత్రిని పొగుడుతూ భూమ్యాకాశాలు ఏకం చేశాను. “కవిత్వం వ్రాయగల వాడే కవి కాదు; ‘కవిత్వాన్ని అర్థం చేసుకోన గలిగి, దాని అంతరార్థం వరకు చేరగలిగిన వారు కూడ కవులే,’ నని కార్లాయిల్ అన్నాడు. దీనిని బట్టి నీవు కూడ కవయిత్రివే. కవిత్వ మహిమను తెలుసుకోలేని వాళ్ళను, ఎంతో మందిని చూశాను. కాని, నీవు అసలు విషయాన్ని వెదుకుతావు. నీలోని ప్రతిభను చూస్తే నాకు ఆశ్చర్యం వేస్తు

న్నది. నీవంటి నారీమణులు ఆదుకుంటున్న, ఈ భారత భూమి ధన్యమయింది.”

నేను వందల కొలది నవలలు చదివేను, మంచి మంచి కవిత్వాలు చూశాను; కాని, సావిత్రి వుత్తరాలలో వున్న మాధుర్యం నాకు ఎందులోనూ దొరకలేదు. వాటినే చదువుతూ వుండాలనిపిస్తుంది.

## 3

## సావిత్రి -

నిస్సందేహంగా ఆయనకు నేనంటే చాల యిష్టం. లేక పోతే, ఈ విధంగా వెంటనే వుత్తర ప్రత్యుత్తరాలు జరపరు. ఈ రోజు వుత్తరం వ్రాస్తే, మూడవనాటికే జవాబు వస్తున్నది. నా వుత్తరానికి ఎదురు చూస్తున్నట్లుగా తోస్తున్నది. ఆయన వుత్తరాలు ఆయన కవిత్వంకంటే ఎక్కువ మాధుర్యంగా వుంటున్నాయి, చదివితే మనస్సు ఆనందసాగరంలో మునిగిపోతున్నది. ఒక్కొక్కప్పుడు ఆయన పరిహాసం చూచి చాల చికాకు కలుగుతున్నది. నేను ఫొటో అడిగాను. దానికి సమాధానమిస్తూ “నీవు, ఫొటోను పంపిస్తున్నానని వ్రాశావు, కాని నాకు యింతవరకు అందలేదు. రిజిష్టరుచేసిన రశీదు వుంటే పంపించు, పోష్టాఫీసుమీాద రిపోర్టు చేస్తాను.” అని వ్రాశారు. అంచేత, నా ఫొటో పంపవలసి వచ్చింది. జవాబుగా ఆయన ఫొటో వచ్చింది. నేననుకొన్నట్లు ఆయన ఎంత అందమయిన వారు! ముఖంలో రాజఠీవి, సౌకుమార్యం

చిందుతున్నది. నా హృదయానికి ముందే శాంతిలేదు; యిహ ఘాటో మిగిలిన శాంతినికూడ దోచుకొంది. రాత్రులు నిద్ర పట్టడంలేదు. ఆయన అంతిమకవిత, ఆయన హృదయాన్ని నా ముందు విప్పి చూపించింది. "ప్రియతమా!" ఎంత ప్రియమైన శీర్షిక! ఒక్కొక్క అక్షరంనుండి ప్రేమ పొంగుతున్నది దీనిముందు కవిత, "పొగమంచుచేసి పొందుతా" అన్నదికూడ నామీదే వ్రాయబడింది. మీరు నన్ను అపఖ్యాతి పాలు చేస్తున్నారని, అసలు నా వెనుక ఎందుకు పడుతున్నారో, చెప్పమని వ్రాశాను. మరొక కవిత "ఏకాంతములో" అన్నది ప్రచురించ బడింది. దీనివలన ఆయన యింతవరకు అవివాహితులని తోస్తున్నది. అయితే, నా......కాని, ఆయన యింత పరిశ్రమ ఎందుకు చేస్తున్నారు? ఎక్కువగా చదువుతుంటే మనిషి వెదురులా గుల్లయిపోతాడు. "కవిత్వం వ్రాయడం మానివేయండి, మీ ఆరోగ్యం గురించి నాకు చాల బెంగగా వుంది." అని వ్రాశాను. తర్వాత ఆయన గురించి అన్నీ తెలుసుకున్నాను. ఆయన మా వంశీయులు, అవివాహితులు కూడాను.

నేను వుత్తరం వ్రాశాను. మొదటి వుత్తరానికీ, ఈ వుత్తరానికి ఎంతో భేదంవుంది. దీనిలో 'సంకోచం' గానీ, 'ఆడంబరం' గానీ-ఏమీ లేదు. "మీ వుత్తరాల వలన ఆనందం కలగడం లేదు. మీ దర్శనమయితే, మీ పాదాల్ని ముద్దుపెట్టుకోవాలని వుంది. నిద్రిస్తూ వుండగా తరచు అదరిపడుతున్నాను. మీ ఆహారానికి సరియైన ఏర్పాటులు వున్నాయో

లేవోనని ఎప్పుడూ ఆలోచిస్తుంటాను. రాత్రులు ఎక్కువసేపు మేల్కొనడం లేదుగదా! ఆరోగ్యం చెడిపోతుంది. ఈ విషయం గుర్తుంచుకోండి. నాకు వుత్తరం వ్రాయడం మరచిపోవద్దు. ఏదో, హృదయంలో దడగా వుంటున్నది. నన్ను మీ చరణదాసిగా భావించండి."

నాల్గవరోజున జవాబు రాగానే నా ఆనందానికి హద్దు లేకపోయింది. ఆయన నన్ను వివాహం చేసుకోడానికి సిద్ధపడటమే కాకుండా ఆత్రుత పడుతున్నారట! నేను కళ్ళుమూసుకుని, ముందు రాబోయే దాంపత్య జీవితాన్ని తలపోస్తూ ఆనందడోలికల్లో వూగ నారంభించాను. ఇంతలో ఎవరో వస్తున్న చప్పుడు వలన నా కళ్ళు తెరుచుకున్నాయి. తమ్ముడు ప్రభాకర్ ఫొటోల 'బాండిల్' ఒకటి పట్టుకొని నిలబడ్డాడు.

"ప్రభ! యిదేమిటి?" అని అడిగాను ఆశ్చర్యంతో.

"ఈ ఫొటోలు చూచి, యిందులో ఒకటి ఎన్నుకో మని నాన్నగారు చెప్పారు. ప్రతి ఫొటోతోను ఒక వుత్తరం కూడ వుంది, అదికూడ చదువుకో."

ఇలా అంటూ ప్రభ ఆ బండిల్ నా చేతిలోపెట్టి పరుగెత్తుకు పోయాడు.

బండిల్ విప్పాను. దీనిలో నన్ను వివాహం చేసుకోవాలనుకొనే పురుషులు ఫొటోలున్నాయి. చిరునవ్వుతో అన్నిటిమీద ఒక తిరస్కారదృష్టిని విసిరి వూరుకున్నాను. ఒకరు బారిష్టరు, యింకొకరు యింజనీరు, వేరొకరు డాక్టరు, మరొకరు జమీందారు. కాని, నాకు ఎవరూ నచ్చలేదు. నా

హృదయకుహరంలో ఒకే మూర్తికి స్థానమున్నది. అక్కడ మొదటినుంచి ఒక మూర్తి ప్రకాశిస్తూనే వున్నది. నేను వెంటనే లేచి, నా పెట్టె తెరచి, అందులోనుంచి ఆయన ఫొటో తీసి Passed అనే శబ్దం వ్రాసి నాన్నగారికి పంపించాను. ఆయన ఆశ్చర్యపోయారు. నేనిలా చేస్తానని ఆయన వూహించి కూడ వుండరు. ఏ లక్షాధికారి కొడుకునో ఎన్నుకుంటానను కొన్నారు; కాని, నేనొక కవిని వరించాను. ఆయన బీదవారు కారు. కాని అంత ధనవంతులుకూడ కారు. నన్ను ప్రేమించే వారిలో ఆయన్ని కొనగల సమర్థులు కూడ వున్నారు. కాని, ప్రేమ గుడ్డిదంటారు. దాని స్వరూపాన్ని ఎవరు చూడగలరు? నాన్నగారు నా కోరికను అంగీకరించారు. ఆయన నన్ను చాల ముద్దుగా పెంచారు. నా చదువుకోసం ఎన్నో వేలు ఖర్చు చేశారు. ఈ విషయంలో కూడ ఆయన నాకు పూర్తి స్వాతంత్ర్యం యిచ్చారు.

## 4

అఖరికి నే ననుకొన్నట్లే అయింది. ఆయనకు జ్వరం రావడం మొదలుపెట్టింది. కొద్ది రోజుల క్రితం ఆయన మిత్రు లొకరు చూడ్డానికి వచ్చారు. డాక్టర్లు క్షయ అంటున్నారని ఆయన చెప్పారు. ఇది విని నాన్నగారు చాల విచారించారు. ఏదో రోగం వచ్చినట్లు ఎప్పుడూ విచారంగా వుంటున్నారు. నేను ఈ వివాహాన్ని మానుకోవాలని ఆయన వుద్దేశం. రగులుతున్న అగ్నిలో దుమకడం మంచిదికాదు. కాని, నేను

లక్ష్యపెట్టను. ప్రాపంచిక దృష్టిలో మేము అవివాహితులము. కాని, మనస్సులు కలిసినప్పుడే ప్రేమపాశం బంధింప బడింది. యిహా, మిగిలివున్న దేమిటి? ఇప్పుడు నేను వారి దాసిని, రోగంగాని, నియమాలుగాని, ఆశయాలుగాని, నన్ను ఆయన నుండి వేరు చేయలేవు. యింకా విప్పి చెప్పాలంటే, మృత్యువుకు కూడ ఈ సాహసం లేదు. సావిత్రి సత్యవంతుణ్ణి యముని చేతుల్లోంచి రక్షిస్తే, నేను ఆయన్ని వ్యాధి ముఖంనుండి కాపాడలేనా? నేనుకూడ సావిత్రినే. ఆ భారతభూమిలోనే నేనూ పుట్టాను. దాసి పూర్వపు ప్రతిభకు ఈ రోజు తిరిగి ప్రాణంపోసి చూపిస్తాను.

సాయంకాలమయింది; నాన్నగారు గదిలో కూర్చున్నారు. నాకు చాల విచారం కలిగింది. ఇది ఆయన క్లబ్బుకు వెళ్ళే సమయం. వేసవికాలంలోను, శీతాకాలాలలోను విడువకుండా వెళుతుంటారు. ఇది ఆయన నియమం. దానికి ఎప్పుడూ విఘ్నం కలుగలేదు. నేను ఆయన దగ్గరకు వెళ్ళి కూర్చుని, నెమ్మదిగా—"ఈ రోజు క్లబ్బుకు వెళ్ళలేదేం?" అన్నాను.

నాన్నగారు మాట్లాడలేదు.

"మీరు విచారంగా కనిపిస్తున్నారు!"

"అయితే నీ కేం?" అన్నారు.

"మీ ఆరోగ్యం చెడిపోతున్నది."

"ఫరవాలేదు."

"భోజనం కూడ సరిగ్గా చెయ్యడం లేదు."

"అంతా నాకు తెలుసు."

"ఏ డాక్టరుకైనా చూపించండి; రోగం ముదరడం మంచిదికాదు."

"ఇప్పుడు నాకు డాక్టరు యమరాజే."

నా కళ్ళు చెమ్మగిల్లాయి; తల క్రిందికివంగి పోయింది. నాన్నగారు మరొక వైపుకు చూస్తున్నారు; అయినా నాకన్నీరు ఆయన చూశారు. సంభాషణ పద్ధతి మారి పోయింది–"సావిత్రీ నేను నా భాగ్యానికి ఏడుస్తున్నాను; కాని నీ కేమయింది?" అన్నారు.

ఆయన నాకేదో పెద్ద అపచారం చేసినట్లు ఆయన వంక చూచి – "మీరు నాకు తండ్రి అయికూడ నా కన్నీటి రహస్యాన్ని గ్రహించలేదా? మీ ప్రతిమాట తేనెపూసిన కత్తిలా వుంది; మీ ప్రతివాక్యం విషపూరిత బాణంలా వుంది. మీకు మిత్రులున్నారు, పనివుంది, క్లబ్బువుంది; బయటకు వెళ్ళుతుంటారు, కాని నేను యింట్లో కూర్చుని కర్మని తలచుకుంటూ ఏడుస్తున్నాను. నేను ఆడపిల్లను, ఆడపిల్లల నోటి నుంచి ఇటువంటి మాటలు రాకూడదు. కాని, ఏమి చేయను? నా జీవితమంతా నాశన మవుతునట్లుగా తోస్తున్నది. ఎలా వురుకోను? మీరు ఆలస్యంచేసి నాజీవితం అంధకార మయం చేస్తున్నారు. అన్నాను.

నాన్నగారు ఎంతో బాధగా "కాని, సావిత్రీ! చూస్తూ విషాన్ని మ్రింగడం తేలిక కాదు. అయినా నీ సపర్యల వలన అతను బాగుపడతాడని నీకు నమ్మకం వుందా?" అన్నారు.

"వుంది. నేను ఆయన్ని రక్షించ గలనని నాకు పూర్తి నమ్మకం వుంది. కవులు నిర్లక్ష్యంగా వుంటారు. ఎక్కువగా చదవడంలోను, వ్రాయడంలోను మునిగివుంటారు. నేను ఆయన జీవితంలోని చిక్కులన్నీ తొలిగించి, ఇంటి ఏర్పాట్లన్నీ స్వయముగా చూచుకొంటాను. రాత్రింబవళ్ళు కవిత్వం వ్రాయడం వలననే ఆయనకు ఈ స్థితి వచ్చింది. ఏ పత్రికలో చూచినా ఆయన కవితే కనిపిస్తుంది. ఈ పని చెయ్యకుండా కొంతకాలం ఆపు చేస్తాను. ముందు మీా ఆరోగ్యం చూసుకోండి, తర్వాత కవిత్వం వ్రాసుకోవచ్చునని చెప్తాను. నౌకర్లు వండిన భోజనం తింటున్నారు, ఏమి వంటపడుతుంది? అందరూ స్తుతిస్తూనే వుంటారు, కాని, సహానుభూతి ఏ ఒక్కరిలోను పేరుకు కూడ వుండదు."

నా మాటల ప్రభావం నాన్నగారి మీాద ఎక్కువగానే పడింది. కొంతసేపు ఆయన ఏమీా మాట్లాడ లేదు. తర్వాత "అంతా బాగానేవుంది. కాని చెప్పడానికీ, చెయ్యడానికి చాల భేదం వుంటుంది. నువ్వు చెప్పేదంతా చెయ్యగలవో లేదోనని నా అనుమానం" అన్నారు.

జన సమూహంతో నిండివున్న బజారులో, తల మీాద గుడ్డ పడిపోయినట్లుగా, నా ముఖం ఎర్రబడింది; అయినప్పటికి సర్దుకొని – "కాని, నా నమ్మకాన్ని త్రోసిపుచ్చకండి. చెప్పినదంతా చేసి చూపిస్తాను." అన్నాను.

"యిదంతా వట్టిది. సమయం వస్తే పొగమంచు తనంతట తానే విడిపోతుంది."

"నా మీద మీకు నమ్మకం లేదా?"

నాన్నగారు మాట్లాడలేదు; ఏమీ సమాధానం తోచ లేదు. కొంతసేపు తలవంచుకొని ఆలోచించారు. తర్వాత హఠాత్తుగా లేచి, ఏమీ అనకుండా బయటికి వెళ్ళి పోయారు.

## 5

వివాహం అయిపోయింది. అంతా అబద్ధం, ఆయనకు ఏ రోగమూ లేదు. యిదంతా ఏవరో పన్నిన కుట్ర. ఆయన ఆరోగ్యం చూచి, మనస్సు పులకించింది. ముఖంలో అరుణ ప్రకాశం, నేత్రాలలో నిర్మల జ్యోతివుంది. నన్ను చూడగానే ఆయన కళ్లు మొగ్గలు వికసించినట్లు వికసిస్తాయి. నేను అనేక మంది కవుల చరిత్రలు చదివేను; ప్రతిఒక్కరిలోను ఏదో ఒక దోషాన్ని చూశాను. చాలమంది ఆచరణలు అంత మంచివి కావు కాని, ఆయన విషయంలో యిలా అనుకోడం కూడ పాపమే. ఆయనకు చాలసిగ్గు. పరాయి స్త్రీ ఎదుట కన్నెత్తే నాడు కాదు. అలా యితర స్త్రీలను చూడటం అపవిత్ర మనే వారు. నా స్నేహితురాలెవరైనా వస్తే, లేచి లోపలకువెళ్ళి పోయే వారు.

"మీరు పురుషులు. స్త్రీయే పరదా ననుసరించక పోతే, పురుషులు ఏం చేయాలి!" అని నే నెంతో చెప్పాను. కాని, ఆయన నవ్వి వూరుకొనేవారు. ఆయన మీదనాకు పూర్తిగా నమ్మకం వుంది. ఏమైనా కావచ్చు; కాని, ఆయన మనస్సులో మాత్రం కల్మషం ప్రవేశించదని నిశ్చయించు కున్నాను. ఇటు వంటి పురుషుడు దొరకడం నా అదృష్టం. ఆయన సర్వస్వం

నాకు అర్పించారు. యింటి వ్యవహారాలన్నీ నా చేతిలోనే వున్నాయి. తనకు తాను బట్టలు కూడ మార్చుకొనే వారు కాదు. నేను చెప్పకపోతే, సరిగ్గా వారం రోజులు గడచిపోయేవి. బట్టలు మాసి పోయాయని కూడ ఆయనకు తెలిసేది కాదు. ఆయన పాలు, పళ్ళు, గది శుభ్రం చెయ్యడం - అన్ని ఏర్పాట్లు నేనే చెయ్యవలసి వచ్చేది. నా స్థానంలో యిష్టానుసారం, నిర్లక్ష్యంగా తిరిగే స్త్రీ వుంటే, ఏమయేదోనని ఎన్నోసార్లు అనుకొన్నాను. యింటిలో దుమ్ము లేస్తుంటుంది. అప్పుడప్పుడు ఆయన జబ్బుపడుతుంటారు. ఆయనకు తమ ఆఫీసు శుభ్రంగా వుంచుకోవాలనే ధ్యాస కూడ వుండదు. అదికూడ నేనే గుర్తుంచుకోవాలి. నౌకర్లను నెత్తిమీద ఎక్కించుకొన్నారు; కాని యిప్పుడు జాగ్రత్త పడ్డారు. ఈదౌర్భాగ్యులు తమంతట తాము ఏ పనీ చేయరు. నిర్బంధం చెయ్యకపోతే కాలుమీద కాలువేసుకొని కూర్చుంటారు. అప్పుడప్పుడు ఆయనమీద నాకు కోపం కూడ వస్తుండేది. ఆయన ఎందుకు నిర్బంధించి పని చేయించుకోరు? నాలుగు రోజులు నేను బయటకు వెళితే, యింటిలో పురుగులు తిరుగుతుంటాయి.

ఒకరోజున - "భారతదేశ మంతా మీ కవిత్వం ప్రసిద్ధికెక్కింది. కాని మీరు యింత నిర్లక్ష్య పరులని, బద్ధకస్తులని ఎవరికైనా తెలుసా?" అన్నాను.

ఆయన చిరునవ్వుతో - "నీ వొక వ్యాస మయినా వ్రాయి." అన్నారు.

"అపఖ్యాతి పాలవుతారు."

"అందులో కొంచెం భాగం నీకు కూడదొరుకుతుంది."

"నా కెందుకు? మీరు నవ్వుతూ తిరస్కరిస్తారు. కాని, కొంచెం ఆలోచి స్తేసరి, యింత నిర్లక్ష్యమా?"

"నిన్ను ఈ యింటికి రాణిగా చేశానుగా!"

"నేను యింటికి రాణినే. కాని మీరుకూడ జాగ్రత్తగా చూస్తుండండి." అన్నాను నెమ్మదిగా.

"నేను నిన్ను నాసూపరింటెండెంటుగా భావిస్తున్నాను."

నేను విసుక్కొంటూ వెళ్ళిపోయాను. కాని చంద్ర బింబం నీటిమీద నాట్యం చేస్తున్నట్లు, నా హృదయం ఆనంద డోలికల్లో మునిగి తేలింది. మర్నాడు వుదయం ఆయన ఆఫీసు వైపుకు వెళ్ళేసరికి, తలుపులకు చిన్న బోర్డు వ్రేలాడకట్టబడి వుంది. దానిమీద___

సావిత్రీదేవి, బి. ఏ., సూపరింటెండెంటు.

అని వ్రాసివుంది.

వెంటనే దానిని తీసి ఆయనముందు విసరికొడుతూ "ఈ కొంటెపనులు చూచి ప్రజలు ఏమనుకొంటారు ?" అన్నాను.

ఆయన నావంక చూచి, చిరునవ్వుతో భుజాలు ఎగరేశారు.

# 6

సాయంకాల సమయం. మంచిబట్టలు వేసుకొని, ఆయన దగ్గరకు వెళ్ళి "కొంచెం బయట తిరిగి వద్దామా ?" అన్నాను.

అప్పుడాయన కవిత్వంలో మునిగివున్నారు. నెమ్మదిగా "ఇప్పుడు మాట్లాడకు, చాల విచిత్రమైన ఆలోచన తట్టింది; దానిని వ్యక్తపరచడానికి శబ్దాలను వెదుకుతున్నాను" అన్నారు.

నాకు విషం ఎక్కినట్లయింది. ఎటువంట పురుషుడు ? ఎప్పుడూ తమ ఆలోచనలలోనే లీనమైపోతారు. నా సంగతే తలచుకోరు. మొదట్లో నన్ను చూచి ఎంతో ఆనందించేవారు; కాని యిప్పుడు ఆయన హృదయంలోని ప్రేమ సన్నగిల్లినట్లు తోస్తున్నది. నా కళ్ళనుండి అగ్నికణాలు రాల నారంభించాయి. "ఎప్పుడూ కవిత్వమేనా? కొంచెం బయట ప్రపంచాన్ని కూడ చూస్తారా?" అన్నాను.

"ఈ కవితతో సాహిత్య జగత్తులో అలజడి లేస్తుంది."

"మీకు నేను జ్ఞాపకం వున్నానా, లేనా ?"

"హృదయాన్ని అడుగు."

"హృదయాన్ని అడగడమెందుకు ? స్వయంగా మిమ్మల్నే అడుగుతున్నాను, కొంచెం తలపైకెత్తి సమాధాన మివ్వకూడదూ ?"

"ఈ కవితచూచి ఎంతో ఆనందిస్తావు. ఇటువంటి కవితను ఈరోజు వరకు వ్రాయలేదు."

నేను నిస్పృహతో "యివ్వాళ షికారుకు వెళ్ళాలని ఎంతో సరదాపడ్డాను. ఈ కవిత్వం ఆ సరదాను అణచి వేసింది. కాగితాల్ని లాక్కొని, సిరాబుడ్డి బద్దలు కొడదా మని వుంది" అన్నాను.

"సిరాబుడ్డి, కాగితాలు చేసిన తప్పు ఏమీలేదు; కాని ఈ వూహాలు మళ్ళీరావు. యివ్వాళ ఒంటరిగా వెళ్ళు."

"నాకు యిష్టం లేదు."

ఆయన చేతితో సంజ్ఞచేసి మళ్ళీ కాగితాలలో మునిగి పోయారు. నా హృదయంలో బల్లెంలా గ్రుచ్చుకొంది. ఆయనకు కవిత్వం మీదే దృష్టిగాని, నామీద లేదు. ప్రపంచ ప్రఖ్యాతి కావాలి, కాని యింటిలో ప్రేమ అక్కర లేదు. అక్కడనుంచి కదులుతూ వుంటే, హృదయం ఎంతో భారంగా తోచింది. ఒంటరిగా షికారుకు వెళ్ళాను; కాని మన స్కరించలేదు. షికారు చేయడానికి యిష్టం లేక నిస్పృహతో, ఒక వంతెనమీద కూర్చొని, నా స్థితి తలచుకొంటూ ఏడ్వ నారంభించాను. ఈ కన్నీటిని చూచి మొదట నాన్నగారు ఎంతో బాధపడేవారు. వివాహం కాగానే నా సుఖదుఃఖాల భారం ఒక కవికి అప్పగించారు. కాని, యిప్పుడు ఈ కన్నీటిని చూసేవారు, దీనిగురించి హృదయాన్ని బాధపెట్టుకొనేవారు లేరు. నా జీవితనౌక నదిమధ్యలో వేగంగా ప్రవహిస్తున్నట్లు, దానిమీద నావికుడు లేనట్లు తోచింది. నా దౌర్భాగ్యాన్ని నిందించుకొన్నాను. బహుశః ఆయన వస్తున్నారేమోనని అప్పుడప్పుడు చూసేదానిని. ప్రేమ త్వరగా నిరాశచెందదు.

నాకళ్ళు నీటిమీద నాట్యం చేస్తున్నాయి. ఏదైనా ఒక శక్తి వన్ను మంత్రబలంతో నీటి కెరటంగా మారిస్తే, గంగా తరంగాలతో ఆడుకొంటూ తిరుగుతాను గదా అని ఆలోచించాను. అకస్మాత్తుగా కళ్ళు మూసుకొన్నాయి; నిద్రా దేవి నా కోరికను పూర్తిచేసింది. నేను నీటిలో పడిపోయాను. చాలసేపు చేతులు, కాళ్లు ఆడించాను. కాని, ఈదలేక పోయాను. ప్రవాహంలో కొట్టుకు పోయాను.

స్పృహ వచ్చేసరికి యింట్లో వున్నాను. ఆయన ఎదురుగా నిలబడి వున్నారు. కుర్చీలో డాక్టరు కూర్చున్నాడు.

ఆయన - "బ్రతికేవు. వీరికి ధన్యవాదాలు చెప్పు. ఈయన నా మిత్రులు డాక్టర్ మణిరామ్. కాశీలో ఈయనకు చాల పేరువుంది. ఈయన నదిలో దుమకక పోతే, నువ్వు ఏమయ్యేదానివో !" అన్నారు.

నేను నెమ్మదిగా లేచి కూర్చున్నాను. చీర కొంగును తలమీద వేసుకొని, డాక్టరుగారి వైపుచూశాను; కాని, కళ్లు లేవలేదు. "పరమాత్ముడు మీకు మేలు చేయుగాక !" అని కళ్ళు మూసుకొన్నాను. కాని హృదయంలో తాపాను చెల రేగింది. ఆయన వెళ్ళిపోతే బాగుండునను కొన్నాను. అలా చేస్తే, పోయిన ధైర్యం తిరిగి వస్తుందేమోనని నా వుద్దేశం. కాని, ఆయన వెళ్ళిపోయిన తర్వాత, పొరపాటు చేశానని తెలిసింది. విచారం ఎక్కువై పోయింది. చల్లని షికారు కోసం వెళ్ళి, అగ్నిని కొని తెచ్చుకొన్నాను.

# 7

## మణిరామ్—

రాత్రయింది; కాని, నిద్ర పట్టడంలేదు. నిద్రను సావిత్రి కళ్ళు దొంగిలించాయి. వాటిలో ఎంత ఆకర్షణ వుంది ! ఎంత విధేయత వుంది ! ఖైదీ లోహపు చువ్వల లోపల వుండి స్వాతంత్ర్యాన్ని తలచుకొని నిస్పృహచెంది భూమిమీద పడి పోయినట్లుంది. తల్లి తన పసి పిల్లవాడు యితరుల ఆటబొమ్మలు పట్టుకోవడం చూచి, తన ఒడిలోకి తీసుకొన్నట్లు, ఆమె కళ్ళు అస్తమానూ నన్ను చూడాలనుకొంటుంటే, ఆమె వాటిని లేవ నిచ్చేదికాదు. అప్పుడు పిల్లవాడు ఎంత మారాము చేస్తాడు ! ఎంత అధీరుడవుతాడు ! తల్లి విడిచి పెడితే ఆట బొమ్మ తీసుకొని పారిపోదామనుకొంటాడు. సావిత్రి కూడా యిదే స్థితిలో వుంది. సత్యవాన్ అక్కడే నిలబడి వున్నాడు. రెండు నిమిషాలైనా తొలగి వుంటే, మనస్ఫూర్తిగా చూసేది. సంపెంగ పువ్వులా ఎంత అందంగా వుంది !

మర్నాడు దుకాణానికి వెళుతుండగా గుమ్మం దగ్గర నిలబడింది. నా వంక ఆశాపూరిత నయనాలతో చూచి చిరు నవ్వు చిందించింది. ఈ చిరునవ్వులో ఎంతో ఆకర్షణ శక్తి వుంది; నా ధైర్యం సన్నగిల్లింది. దుకాణం మీదకు మనస్సే పోలేదు; కూర్చొని - కూర్చొని ఎప్పుడు సాయంకాల మవు తుందా అని ఎదురు చూశాను. క్షణాలు లెక్కపెడుతుండగా పగలు గడిచింది; యింటికి బయలు దేరాను. కాళ్ళు భూమి

మీద పడటం లేదు. ఎవరికో ఏదో దొరుకుతున్నట్లు సంతోషం కలిగింది నాకు. సత్యవాని ఇంటి దగ్గరకు చేరగానే కాళ్ళు తమంతట తామే ఆగిపోయాయి, కళ్లు గుమ్మం మీద చిందులు త్రొక్కుతున్నాయి. యింతలో ఆమె లోపల నుండి వచ్చి, గుమ్మానికి ఆనుకొని నిలబడింది. ఆమె నోటితో ఏమీ అనలేదు; కాని కళ్లు మాత్రం హృదయంలోని రహస్యాన్ని వెళ్ళడించాయి. ఆ కళ్ళలో ఎంత ప్రేమ వుంది, ఎంత దయ వుంది! వాటితో పాటు స్త్రీలకు వుండే సహజమైన సిగ్గు. పచ్చడిలో పులుపుతో సహా చక్కెర కూడా కలిపినట్లుగా వుంది. శత్రువును ఓడించి కోటను జయించినట్లుగా, మత్తెక్కిన వాడిలా వూగుతూ యింటికి చేరాను.

చాల రోజులు గడచి పోయాయి. కళ్ళల్లోంచి పుట్టిన ప్రేమ దృఢమయి పోయింది. కాని, యిప్పుడు ఆమెను చూచినంత మాత్రంలో ఆనందం కలగడం లేదు; మంచు బిందువులతో దాహం తీరుతుందా? దాహం యింకా పెరుగుతూనే వున్నది. ప్రమాద సమయంలో ఎవరో ఎర్ర జెండాను చూపినట్లుగా ఆత్మ ఓదారుస్తూ వున్నా, సారాయి త్రాగిన డ్రైవరు లా కామపిశాచం లక్ష్య పెట్టడం లేదు. ఈ సారాయి మామూలు సారాయి కాదు. ఇది ధర్మ-కర్మలను భస్మం చేసి, మానవుణ్ని ఘోర ప్రమాదంలో త్రోసే సారాయి; ఇది కామవాంఛా పూరితమైన సారాయి.

ఒక రోజున చాలరాత్రి అయినతర్వాత యింటికి బయలుదేరాను. ఏదో పెద్ద హాని జరిగినట్లు మనస్సు బాధ

పడుతున్నది. కాని సావిత్రి గుమ్మం దగ్గరే నిలబడి వుంది. కొంచెం సంతోష పడాను, నా శ్రమకు ఫలితం దక్కింది. కోపం దుఃఖం — అన్నీ దూరమయ్యాయి.

సావిత్రి – "ఈరోజు మీకు చాల ఆలస్యమయింది." అంది.

కాని ఆ మాటలలో వణుకు స్ఫురిస్తున్నది.

నా హృదయం కొట్టుకో నారంభించింది. శరీరమంతా చెమట పోసింది. విద్యార్థి దశలో కొన్ని వందల శవాల్ని కోశాను. అప్పుడుకూడ ఈ స్థితి ఎప్పుడూ కలగలేదు. ప్రతి అవయవం వణక నారంభించింది. అతి కష్టంమీద సర్దుకొని— "అవునండి. రోగుల్ని చూడ్డానికి వెళ్ళాను. మీరు గుమ్మం దగ్గర నిలబడ్డారు! ఎవరి కోసమయినా నిరీక్షిస్తున్నారా?" అన్నాను.

"అవును. ఆయన కోసం చూస్తున్నాను."

"యివ్వాళ ఏదైనా కవి సమ్మేళన వుందా?"

"కవి సమ్మేళన లేదు. ఏదో సభకు వెళ్ళారు. అక్కడ, ఆయన వ్రాసిన నూతన కవితను చదువుతారట."

"అయితే పన్నెండు గంటలవుతుంది."

సావిత్రి తృష్ణాపూరిత నేత్రాలతో నా వంక చూచి, నిట్టూర్చి "యింట్లో ఏమీ తోచడం లేదు." అంది.

"యిప్పుడు ఎనిమిదే అయింది."

"గడియారం ముళ్ళు విరిచేస్తే బాగుంటుంది."

నా కాళ్ళు ఆడటం లేదు. ఒక మంచి నాటకం జరుగు తున్నట్లుగా తోచింది. కాని, ఎవరైనా చూస్తారేమో నని కాళ్ళు కదిపాను. మనకు ధైర్యం వున్నా లేకపోయినా, యిత రుల నిందల్ని తలచుకొని తప్పకుండా భయ పడతాము. సావిత్రి కళ్ళు "యింకా తెలుసుకోలేదా?" అన్నట్లు నా వంక చూశాయి.

నేను ముందుకు కదిలాను. కాని హృదయం వెనక్కు లాగుతున్నది. మనస్సు స్వాధీనంలో లేదు. యింటికి వెళ్ళగానే హృదయం ఎంతో భారంగా తోచింది. సావిత్రి ప్రతిమ కళ్ళ లో తాండవించ నారంభించింది. ఆమె మధురవాణి చెవుల్లో ప్రతిధ్వనించ సాగింది. ఆమెను మరచి పోవాలను కొన్నాను. ఈ బురదలో కాలు పెడితే అప్రతిష్ఠ పాలవుతానని భయం. ప్రతివాళ్ళు నన్ను వేలుపెట్టి చూపుతారు. యిప్పుడు ప్రజలు నన్ను పెద్దమనిషిగా భావిస్తునారు. కాని, ఈపని నన్ను సర్వ నాశనం చేస్తుంది. ప్రజలు ఆశ్చర్యపోతారు. అంత పెద్ద మని షిగా ఉండి, యిలాంటి పని చేసేడేమిని అందరూ అనుకొం టారు. ప్రాక్టీసు కూడ తగ్గిపోతుంది. ఆమె వివాహిత స్త్రీ. ఆమె కోసం ఆశించడం చాల అనుచితం. కాని ఈ మాటలు, వూహ - అన్నీ నీటి బుడగలు ఎంత త్వరగా తయారవు తాయో, అంత త్వరగా మాయమవుతాయి. చిన్న గాలిదెబ్బ వాటి చిహ్నంకూడ లేకుండా చేస్తుంది. మానవుడు ఎంత దుర్బలుడు, ఎంత అసమర్థుడు!

మర్నాడు నేను సత్యవానుని యింటికి వెళ్ళాను. కాని; క్రొత్త దొంగ దొంగతనానికి వెళుతున్నట్లుగా కాళ్ళు వణుకుతున్నాయి. అప్పుడు అతని హృదయం ఎలా వణుకుతుందో! ఎటునైపు నుండైనా, ఎవరైనా చూస్తారేమో ! ముఖంలోని మార్పుఅసలు విషయం చెప్పేస్తుందేమో ! కాని, అప్పుడప్పుడు అస్పష్ట ఆశాజ్యోతి కూడ కన్పిస్తుండేది. కాలు ముందుకు వేస్తే, హృదయం వెనక్కు లాగేది. ఒక్కసారి ఊపిరి బిగబెట్టి, లోపలకు వెళ్ళిపోయాను. నా పెదిమలు పూర్తిగా ఆరిపోయాయి.

సత్యవాన్ నన్ను చూడగానే కుర్చీలోంచి లేచి, ఎంతో ప్రేమతో సత్కరించాడు. చాలసేపు మాట్లాడు కొన్నాము. సావిత్రికూడ దగ్గరే కూర్చొని వుంది. నా కళ్ళు ఆమెనే చూస్తూవున్నాయి. మొదట దొంగను, యిప్పుడు బందిపోటు దొంగనయ్యాను, సావిత్రి సంకోచంకూడ దూరమయింది. ఆమె ప్రతి మాటకు నవ్వుతుండేది. ఇప్పుడామెకు నా వంక చూడ్డానికి సంశయంలేదు. సిగ్గుకు బదులుగాచపలత్వం వచ్చింది. అక్కడనుండి వచ్చేయగానే ఇంద్ర సింహాసనం దొరికినంత సంతోషం కలిగింది. తర్వాత అంతా మామూలయి పోయింది. ప్రతిరోజు ఎన్నోసార్లు సావిత్రి కన్పిస్తుండేది. రాత్రులు రెండేసి గంటలు ఆమె దగ్గర కూర్చొనే వాడిని. కళ్ళద్వారా మా ఇద్దరి మనస్సులు కలిసిపోయాయి. కాని సత్యవాన్‌కి ఏమీ తెలియదు. కల్పనా సాగరంలో ముత్యాలవంటి భావాల్ని ఏర్చి కూర్చె కవి, దూరదృష్టిని ప్రసరింజేసే విప్లవకారవండి

తుడు, తన సమక్షంలోని దృశ్యాన్ని తెలుసుకోలేక పోయాడు. అతని కవిత్వం యింకరుల్ను మేల్కొల్పుతుంది, కాని అతను స్వయంగా నిద్రపోతున్నాడు. నావలో కూర్చొని దూరంలో నున్న పచ్చనిపొలాలు, ఉన్నతశిఖరాలు చూచి మత్తెక్కి; తన నావ భయంకరమైన రాతి దగ్గరకు చేరుతూవుందని తెలుసుకోలేని, అమాయక యాత్రీకునిలా, సత్యవాన్ నెమ్మదిగా పతనానికి దారి తీశాడు.

# 8

## సావిత్రి —

ఎంత భేదం వుంది! మణిరామ్ కళ్ళు హృదయంలో అగ్నిని రగుల్కొల్పుతున్నాయి. సూదంటురాయి లోహపు సూదిని లాక్కొన్నట్లుగా నేను లొంగి పోతున్నాను. నోట్లో నాలుక లేనట్లు ఎంత అమాయకంగా వుంటాడు! పికిలిపిట పూల కొమ్మమీద కూర్చొని కిచకిచ లాడినట్లు, నా దగ్గరకు వచ్చినప్పుడు కిలకిల నవ్వుతుంటాడు. అతను దగ్గర లేనప్పుడు ఏదో పోగొట్టు కొన్నట్లుంటుంది. నా దగ్గరే వుండిపోతే బాగుండుననిపిస్తుంది. నోటితో అనలేదు కాని, వీధిలోని స్త్రీ లంతా తెలుసు కొన్నట్లు వాళ్ళ కళ్ళే చెపుతున్నాయి. నా వంక చూస్తే అదొక రకంగా నవ్వుతుంటారు. ఆయన కూడ అనుమానించి నట్లుంది. కవులు మూర్ఖులుమాత్రం కారు. నిర్లక్ష్య పరులు, కాని తెలియనివారు కారు. ఇప్పుడు చేతులు నలుపుకొంటూ విచారిస్తున్నారు. ప్రపంచాన్ని జయించారు,

కాని యింట్లో ఓడిపోయారు. ఎప్పుడు చూసినా విచారంగా వుంటున్నారు. రాత్రులు నిద్ర పోవడంలేదు, మాట్లాడితే విసుక్కొంటున్నారు. కళ్ళల్లోంచి రక్తం చిందుతుంది. తిండిగోడవే లేదు. ఎన్నో రోజుల వరకు స్నానం కూడ చేయడం లేదు. ఇప్పుడు ఆయన బట్టల గురించి, భోజనం ఏర్పాట్ల గురించి నాకు అసలు శ్రద్ధే కలగడం లేదు. ఒకప్పుడు ఈ పనులలో ఎంతో ఆనందం కలిగేది; కాని యిప్పుడు భయం వేస్తున్నది. కొన్ని రోజుల తర్వాత ప్రయాగ నుంచి వచ్చే ప్రసిద్ధ మాస పత్రిక "సరస్వతి"లో ఆయన కవిత ఒకటి ప్రచురించ బడింది. దాని మొదటి చరణం—

"ప్రేమలేనివారితో స్నేహమేల !"

ఏమి కవిత్వం ! ఆయన తన స్థితినే చిత్రించారు. నా కళ్ళనుంచి నిప్పుల వర్షం కురవ నారంభించింది. సింహంలా ఆయన దగ్గరకు వెళ్ళి "ఇదేంకవిత్వం ?" అన్నాను.

రాతినికూడ కరిగించే దృష్టితో ఆయన నావంక చూశారు. ఆ చూపులో దుఃఖం, నిరాశ పూర్తిగా గోచరిస్తున్నాయి. నెమ్మదిగా "ఏం ?" అన్నారు.

"ఈ కవిత్వం చదివిన ప్రజ లేమను కొంటారు ?"

"కవి చూసినదంతా వ్రాస్తాడు. యిందులో నా దోషమేముంది ?"

నేను కొంచెం నసుగుతూ "మీ రేమి చూశారు ?" అన్నాను.

"సావిత్రీ! నా నోటితో వాగించకు. నీ చీరకొంగులో ముఖం పెట్టుకొని, చూసుకో. నాకు తెలియనిదేమీ లేదు."

నేను కోపంతో "ఎందుకు తిడతారు?" అన్నాను.

"దీనికంటే తిట్లే లక్షరెట్లు మేలు."

"అయితే, మీకు నామీద సందేహమా?"

"సందేహమయితే, ఏడ్వడమెందుకు? దృఢమైంది. చెవులు మోసపోవచ్చును; కాని కళ్ళు మోసపోలేవు. నా యిల్లు ఈ విధంగా చదరంగమవుతుందనుకోలేను."

నాకు చాల దుఃఖం కలిగింది. కాని ప్రకృతిమూలంగా సిగ్గు దురాచారానికి అంకితమయి పోయింది. విసుక్కొంటూ "మీరు కవిత్వం వ్రాసుకొంటూ వుండండి. ఎవరెలాపోతే ఏం?" అన్నాను.

"పుండుమీద కారం వెయ్యాలని వచ్చావా?"

"నా గొడవే అక్కర్లేదు. మొదటో ఎక్కడి కెళ్ళింది ఈ బుద్ధి?"

"నిన్ను అర్థంచేసుకోలేక పోయాను. లేకపోతే, యిప్పుడు చేతులు నలుపుకోను."

"అయినా ఫరవాలేదులెండి. ప్రజలు మిమ్మల్ని పొగుడుతున్నారు; ప్రతి పత్రికలోను మీ పొగడ్తలు చదివి అంతా సంతోషిస్తూ వుంటారు."

ఇదివిని ఆయన లేచారు. ఆయన కళ్ళలో పిచ్చివానిలా వింతఎరుపు ప్రకాశిస్తున్నది. గట్టిగా "నీ చావును మరచిపోకు; నేను పిచ్చివాడినయి పోతున్నాను" అన్నారు.

"అయితే చంపుతారా ? సరే, మీ కోరిక ప్రకారం మీ చేతిమీదుగానే చెయ్యండి."

సింహం తనవేటను చంపేముందు చూచినట్లుగా, ఆయన ఒకసారి నావంక చూశారు. నా గుండె అదరసాగింది. పరుగెత్తుకొని బయటకు వెళ్ళిపోయాను. ఆయన నా వెనుక పరుగెత్తు తున్నారేమోనని యింటిముందు మైదానంలోకి వెళ్ళి నిలబడ్డాను. మృత్యువు సమీపించినట్లు నా శ్వాస అతి వేగంగా కొట్టుకో నారంభించింది. కాని ఆయన రాలేదు. కొంతసేపైన తర్వాత 'ధన్' మని శబ్దం వినిపించింది. నేను పరుగెత్తుకొంటూ లోపలకెళ్లాను. ఆయన కంబళీమీద పడి కొట్టుకొంటున్నారు. మరణ దృశ్యాన్ని చూచి నేను భయ పడ్డాను. కాని నాకు దుఃఖం కలగలేదు. ఏదైనా కేసు జరుగు తుందేమోనని మాత్రం భీతి కలిగింది.

రెండు నెల్లు గడచాయి. నేను వాకిట్లో కూర్చుని మణిరామ్ కోసం 'నెక్‌టయ్' అల్లుతున్నాను. లోకాచారాన్ని లెక్క చెయ్యకుండా, ఆయన్ను వివాహం చేసుకోడానికి నిశ్చ యించుకొన్నాను. ఈ సంగతి విని ప్రజలు ఆశ్చర్యపోయారు. ఆయన చనిపోగానే ఎంతో సంతోషించాను. జీవితం ఆనంద మయంగా వుంటుందనుకొన్నాను. ఇంతలో నౌకరు పోస్టు తెచ్చి నా ముందు వుంచాడు. అందులో ఒక 'పేకట్' కూడ వుంది. మొదట దానినే తెరచాను. ఇది ఆయన కవితాసంగ్ర హం. ఏ కవిత చదివినా విశ్వమలినానికి దూరంగావున్న పవిత్ర భావాలతోను, ఉన్నతాశయాలతోను నిండివుంది. ఈ

కవిత్వంలో మోసంలేదు, కల్మషంలేదు; ఆధ్యాత్మిక సుఖం వుంది, శాంతివుంది, మాధుర్యం వుంది. నా కళ్ళ వెంబడి అశ్రుధారలు ప్రవహించ నారభించాయి. అకస్మాత్తుగా మూడవ పేజీ మీదకు దృష్టిపోయింది. ఇది అంకితం పేజీ. నా రక్తం తోడుకుపోయింది. పుస్తకం నాపేర అంకితం చేయబడింది. ప్రతి శబ్దంలోను ప్రేమామృతం చిందుతున్నది. కాని, ఈ ప్రేమలోను, మణిరామ్ ప్రేమలోను ఎంత భేదం వుంది! మొదటిది చల్లనిచంద్రుని వెన్నెలలాంటిది, రెండవది తీక్ష్ణమైన అగ్ని లాంటిది. మొదటిది సముద్రంలా గంభీరమైన లోతైనది, రెండవది పర్వతం మీదనుండిజారే కాలువలా వేగమైనది. మొదటిది సత్యం, కాని నిరాడంబరంగా వుంటుంది; రెండవది అసత్యం, కాని ఆడంబరంగా వుంటుంది. నా కళ్ళను ఆవరించినపొర తొలగిపోయింది. సతీత్వమనే ఉన్నత శిఖరం నుండి ఏదో లోయలోకి బడబోతున్నట్లుగా తెలుసుకొన్నాను. అక్కడనుంచి కదలలేక పోయాను. పుస్తకాన్ని కళ్ళకద్దుకొని ఏడ్వనారంభించాను.

ఇంతలో మణిరామ్ లోపలకు వచ్చాడు. కలుగబోయే సుఖాన్ని తలచుకొని ముఖం ఎర్రబడింది. అతని చేతిలో నా కోసం బొంబాయినుండి తెప్పించిన బహు మూల్యమైన హారం వుంది. అది చూపించాలని వచ్చాడు. నేను ఏడుస్తుండటం చూచి ఆశ్చర్యపడి "ఎందుకు ఏడుస్తున్నావ్?" అన్నాడు.

"నా కళ్ళు తెరచుకొన్నాయి."

"ఈ హారం చూడు. రేపే వివాహం."

"యిహ వివాహం కాదు."

"సావిత్రి! పిచ్చిదానిలా మాట్లాడతావేం?"

"పరమాత్ముడు నన్ను ఈ విధంగానే పిచ్చిదానిగా వుంచుగాక!"

మణిరామ్ ముందుకు వచ్చాడు. కాని, నేను లేచి వెనక్కు వెళ్ళి, గుమ్మంవైపునకు చూపుతూ "అటు" అన్నాను.

ఇంతకుముందు ఎన్నడూ రాని నిద్ర, నాకు ఆరోజు వచ్చింది. నేను భర్తను నిరాకరించాను; కాని ఆయన ప్రేమను నిరాకరించలేక పోయాను, మనిషి చనిపోతాడు, కాని ప్రేమ బ్రతికే వుంటుంది.

# పం. చతుర్ సేన్ శాస్త్రి

శ్రీ చతుర్ సేన్ శాస్త్రి గారు ఢిల్లీ నివాసులు. గొప్ప పేరు - ప్రఖ్యాతులు చెందిన వైద్యులు. అనేక సంవత్సరాలు బొంబాయి, ఢిల్లీ, లక్నో మొదలైన పెద్ద పెద్ద పట్టణాలలో పని చేశారు.

ఈయన కథలో లీనమైపోయి, యితరుల యిష్టా యిష్టాలతో నిమిత్తంలేకుండా, చెప్పదలచుకొన్నది నిర్మొహమాటంగా, ముక్కుకు సూటిగా చెపుతారు. యితరులు పొగిడినా, దూషించినా కూడ లెక్క చెయ్యరు.

ఈయన వ్రాసిన "హృదయపరీక్ష" అనే నవల ఎన్నో విమర్శలకు గురి అయింది.

ఈయన భాషలో కోమలత్వము, చురుకుదనము వుంటుంది. శైలి సరళంగా, నిరాడంబరంగా వుంటుంది.

# తేనెపూసిన కత్తి

మూలం : శ్రీ చతుర్ సేన్ శాస్త్రి

అతని పేరు అడగకండి. నేటికి పది సంవత్సరాల నుండి ఆ పేరును హృదయంలోంచి, ఆ ఆకారాన్ని నేత్రాలలోంచి వేరుచేయాలని పిచ్చివానిలా తిరుగుతున్నాను. కాని, ఆ పేరు ఆ రూపు ఎప్పుడూ నా వెను వెంటనే వుంటున్నాయి. నేను భయ పడుతున్నాను. అతను నిర్భయుంగా వున్నాడు; నేను ఏడుస్తు న్నాను. అతను నవ్వుతున్నాడు, నేను చనిపోతాను. అతను అమరుడు.

నాకు అతనికి అంతకు పూర్వము ఏ విధమైన పరిచయం లేదు. ఢిల్లీలో మా రహస్యసమావేశంవుంది. అన్నిదళాల మనుష్యులు వచ్చారు. అతనుకూడవచ్చాడు. అతను నా దగ్గరే నిలబడి చిన్నకుక్కపిల్లతో కేరింతాలు కొడు తున్నాడు; కాని, నాదృష్టి అతని వైపులేదు. మా దళ నాయ కుడు నాదగ్గరకొచ్చి సహజగంభీరస్వరంతో నెమ్మదిగా "ఈ యువకుణ్ణి బాగా గుర్తించు; యితనితో నీకు అవసర ముంటుంది." అన్నాడు.

నాయకుడు వెళ్ళిపోయాడు. నేను యువకుని వైపుకు తిరిగేను, బహుశా నాయకుడు మాయిద్దరకు ఏదో కార్య భారాన్ని వేస్తాడనుకొన్నాను. "ఎంత ముచ్చటయిన పిల్ల!" అన్నాను యువకునితో అతను పచ్చిపాలవంటి స్వచ్ఛమైన

తన నేత్రాల్ని నాముఖంమీద వేసి "నేను దీని తమ్ముడనైతే ఎంత బాగుండేది" అన్నాడు. నేను ఒక్కసారి ఫక్కున నవ్వేను. అతను చిరునవ్వు చిలికించి వూరుకొన్నాడు. ఏవేవో మాట్లాడుకొన్నాం. ఆరోజునుంచి అతను నా మిత్రుడు అయ్యాడు.

రోజులు గడుస్తున్నాయి. నిర్మల ప్రేమధారలు యిరువురి హృదయాలలో పొంగి ఒకేప్రవాహంగా అయిపోయాయి; సరళస్వభావము, నిష్కపట వ్యవహారాలనుచూచి యిద్దరం ముగ్ధులమయ్యాము. అతను నన్ను తనవూరికి తీసుకెళ్ళేంత వరకు వూరుకోలేదు. అతను ఆవూరి జమీందారుగారి అబ్బాయి. ఏకైకపుత్రుడు; హృదయానికి, ఆకారానికి ఒకే విధంగా; అతని తల్లి రెండు రోజులలోనే నన్ను "నాయనా!" అన నారంభించింది. నాకు జ్ఞానం వచ్చిన తర్వాత అక్కడే ఏడురోజులు మాతృస్నేహాన్ని పొందేను. తర్వాత వచ్చేశాను. మళ్ళీ వెళ్ళివచ్చాను. యిప్పుడు అతను లేకుంటే, ఏదో జారిపోయినట్లుంది. ఇద్దరి ప్రాణాలు ఒకటైపోయాయి. ఒక రోజున ప్రేమావేశములో "ఏదో ఒక విచిత్ర ఘటన ద్వారా, మన యిద్దరిలో, ఎవరో ఒకరు స్త్రీగా మారిపోతే, నిన్నే వివాహం చేసుకొంటాను" అన్నాడతను.

"అతనితో స్నేహం చేయమని నాతో ఎందుకు చెప్పావు మీరు?" అని అనేకసార్లు నాయకుని అడిగేను. "సమయం వచ్చినప్పుడు తెలుసుకొందువు గానిలే!" అంటుండేవాడు. రహస్యసమావేశం లోనిభయంకరగాంభీర్యం అందరూ

తెలుసుకో లేరు. నాయకుడు భయంకర గంభీరమూర్తి వంటివాడు.

ఆరోజు భోజనం చేసేసరికి అతని దగ్గరనుండి వుత్తరం వచ్చింది. యిప్పుడుకూడ అది నాజేబులో వుంది. కానీ, ఎవ్వరికీ చూపించను. అదిచూచి ఆనందంతో రెండు నిట్టూర్పులు విడుస్తుంటాడు. అశ్రుధారల్ని ప్రవహింపజేసి, హృదయాన్ని తేలిక పరుచుకొంటాను. ఒక దీర్ఘకాలపు రోగికి మందే ఆహారంగా తయారయినట్లు, నా వ్యధిత హృదయానికి ఆవుత్తరం ఆహారంగా తయారయింది.

యింకా వుత్తరమైనా చదువలేదు. యింతలో నాయకుని పిలుపు వచ్చింది. నేను అతని ఎదుటకు వెళ్ళి సరళ స్వభావంతో నిలబడ్డాను. పన్నెండుగురు ప్రధానులున్నారు. నిశ్శబ్దం ఏదో భయంకర సత్యాన్ని బొమ్మగా చిత్రిస్తున్నది. ఒక నిముషంలో నేను దృఢగంభీరపూరితుడ నయ్యాను. కాల్చిన యినుప కడ్డీలు నా కళ్ళల్లో గ్రుచ్చుకొన్నట్లు నాయకుని మర్మపూరిత దృష్టి నా నేత్రాల్లో పడింది. కళ్ళలో అగ్ని కణాలు పడి, మండిపోయినట్లు, రెప్పవేయడమే మరచిపోయాను; ఐదునిమిషాలు గడచిపోయాయి. "జాగ్రత్త! నువ్వు సిద్ధంగా వున్నావా?" అన్నాడు నాయకుడు గంభీరస్వరంతో.

నేను నిజంగా సిద్ధంగానే వున్నాను; కంగారుపడలేదు. అదేసభకు పరీక్షార్థిగా వచ్చిన సభ్యుడనేగా నేను! నియమాను సారంగా తలవంచాను. రక్తవర్ణంతో కూడిన భగవద్గీత గ్రంథం నెమ్మదిగా బల్లమీాద పెట్టబడింది. నియమపూర్వ

కంగా రెండు చేతులతో ఎత్తి శిరస్సుమీద పెట్టుకొన్నాను.

నాయకుడు నా చేతిలోని గ్రంథాన్ని తీసుకొన్నాడు. ఒక క్షణంపాటు నిశ్శబ్దం వ్యాపించింది. నాయకుడు వున్న ట్లుండి, అతని పేరుచెప్పి, అదే క్షణంలో ఆరుగుళ్ళ పిస్తోలు మేజామీద పెట్టేడు.

ఆ పిస్తోలులోని ఆరు గుళ్ళవలె, ఆ ఆరు అక్షరాల పేరు మస్తిష్కంలో దూసుకుపోయింది. కాని, నేను కంపించ లేదు. ప్రశ్నించి కారణం తెలుసుకోవడానికి ప్రయత్నించడ మన్నది నిషేధం. నియమ పూర్వకంగా పిస్తోలు తీసుకొని వక్షానికి హత్తుకొని, అక్కడనుంచి వచ్చేశాను.

వెంటనే నేను ప్రయాణమయ్యాను. అతను స్టేషన్‌దగ్గ రున్నాడు. మా మధ్య నడచిన పరస్పర వుత్తరాలను గురించి అతని కేవిధమైన సందేహము లేదు. మా నిర్మల ప్రేమలో అతనికి అనుమానమన్నదే స్ఫురించ లేదు. అందుకే, చూడ గానే కౌగిలించుకున్నాడు. యింటికి వెళ్ళి నాలుగు రోజులు న్నాను. అతను ఏమి చేస్తున్నాడో, ఏమంటున్నాడో; నేను చూడలేక పోతున్నాను. వినలేక పోతున్నాను. శరీరం నిశ్చ లంగా వుంది. ఆత్మ ధృంశగా వుంది. భావాలు స్థిరంగా వున్నాయి; కాని, హృదయం మాత్రం కొట్టుకొంటున్నది.

నాలుగవరోజు ప్రాతఃకాలం అల్పాహారంచేసి స్టేషనుకు వెళ్ళాము. అడవిలో తిరుగుతూ వెళ్ళాలనే వుద్దేశంతో 'టాంగా' తీసుకోలేదు. కావ్యాలు గురించి తీవ్రంగా విమర్శ జరిగింది. ఆ మదంలో అతను నా మనోద్విగ్నతను గుర్తించ

లేకపోయాడు. ఎండ యింకా ఎక్కువయింది. శరీరమంత చెమటపోసింది. "పద, ఎక్కడైనా నీడలో కూర్చుందాం" అన్నాను. ఎదురుగా దట్టమైన పొదవుంది; అక్కడకు వెళ్ళాము. కూర్చోగానో జేబులోంచి రెండు జామపళ్ళు తీసి "మా తోటలో రెండంటే, రెండే పండాయి. యిక్కడ కూర్చొని తినాలనే తెచ్చాను. ఒకటి నీకు, ఒకటి నాకు." అన్నాడు.

నేను మాట్లాడకుండా జామపండు తీసుకొని తిన్నాను. అకస్మాత్తుగా లేచి నిలబడ్డాను. అతను సగం జామపండు తిన్నాడు. అతని మనస్సు దాని రుచిలో లీనమైపోయింది. నేను నిశ్శబ్దంగా పిస్తోలుతీసి, గుర్రం ఎక్కి, సాధారణ స్వరం తో అతని పేరుపెట్టి పిలిచి "జామపండు పారేయ్! భగవంతుని స్మరించుకో; నేను నిన్ను పిస్తోలుతో చంపుతాను" అన్నాను.

అతనికి నమ్మకం కలుగలేదు. "మంచిదే! కాని, దీనిని తిననియ్!" అన్నాడతను. నా ధైర్యం సన్నగిల్లుతున్నది. "సరే, తిను" అన్నాను. గొంతుబిగించి జామపండు తిన్న తర్వాత అతను బిగుసుకొని నిలబడ్డాడు. "ఊఁ కాల్చు!" అన్నాడు. "ఎగతాళి అనుకోకు; నిజంగా పిస్తోలుతో కాలు స్తాను;" భగవంతుని తలచుకొని, గంభీరాన్ని నటిస్తూ నిల బడ్డాడు. నేను ఒకచేత్తో నా వక్షాన్ని నొక్కిపట్టుకొని "భగ వంతుని మీద ఒట్టు. వేళాకోళమనుకోకు. నేను నిన్ను గుండు తో చంపుతాను" అన్నాను.

ఆ పచ్చిపాలవంటి స్వచ్ఛమైన నయనాల్ని నా నేత్రా ల్లో కలిపి "చంపు" అన్నాడు.

ఒక్క-క్షణం ఆలస్యంచేస్తే నా కర్తవ్యాన్ని నిర్వర్తించుకోలేను. క్షణక్షణానికి సాహసం అడుగంటి పోతున్నది. "ధన్ ధన్'' అని రెండుశబ్దాలు ప్రతిధ్వనించాయి. అతను నరికిన వృక్షంలా పడిపోయాడు. రెండుగుళ్లు ఛాతీని చించుకు పోయాయి.

నేను పారిపోలేను. భయంతో యిటు అటు చూడనైనా లేదు; ఏడ్వనూ లేదు. అతన్ని ఒడిలోకి తీసుకున్నాను. ముఖంమీద వున్న మట్టిని తుడిచేను. రక్తం శుభ్రంచేశాను. యింతలోనే కళ్ళలో ఏదో చెప్పలేని మార్పు వచ్చింది. తల్లి నిద్రిస్తున్న పిల్లవాణ్ణి ఒడిలో పెట్టుకొని-లేస్తాడనే భయంతో-నిశ్చలంగా కూర్చునట్టుగా, చాలసేపటి వరకు కూర్చున్నాను.

లేచాను. కట్టెలు ఏరి, చితి తయారుచేసి అంటించాను. ఆఖరివరకు కూర్చున్నాను.

◆ ◆ ◆ ◆

పన్నెండుగురు ప్రధానులూ వున్నారు. అక్కడకే వెళ్ళి నిలబడ్డాను. నాయకుడు చెయ్యిచాపి పిస్తోలు యిమ్మన్నాడు. పిస్తోలు యిచ్చేశాను. కార్యసిద్ధిని తెలిపే సంకేతం సంపూర్ణమయింది. నాయకుడు నిలిచి గంభీరస్వరంతో "ప్రధానుల పదమూడవ కుర్చీ నీకు యిస్తున్నాం" అన్నాడు.

"పదమూడవ ప్రధాన పదవినుండి, అతని అపరాధమేమిటో తెలుపమని అడుగుతున్నాను." అన్నాను.

నాయకుడు వినయ పూర్వకంగా "హత్యలకు సంబంధించిన మన కుట్రలను అతను అంగీకరించడం లేదు. అతను ప్రభుత్వ గూఢచారని మా అనుమానం." అన్నాడు. నేనేమీ అనలేక పోయాను.

నాయకుడు అదే గంభీరంతో "నూతన ప్రధాన పదవి నుండి, నువ్వోక యిష్టమైన బహుమతిని కోరవచ్చును."

నాకు ఏడుపు వచ్చింది. నా వాగ్దానాల నుంచి నన్ను మరల్చండి. నా ప్రతిజ్ఞలనుండి విముక్తి చేయండి. నేను అతని సముదాయములోని వాడినే. గుండెలమీాద పడుతుండే గండ్రగొడ్డలిని ఎదుర్కొనే సాహసం మీాలో లేకపోతే, మీారు దేశభక్తులమని చెప్పుకోడానికి సిగ్గుపడండి. మీారు చేస్తున్న ఈ పిరికి హత్యల్ని చూస్తుంటే, నాకు అసహ్యం కలుగుతున్నది. హంతకులకు అనుచరునిగాను, సలహాదారుని గాను, మిత్రుని గాను మాత్రం నేను వుండలేను. మీారు పదమూడవ కుర్చీని తగల బెట్టండి." అన్నాను.

నాయకునికి కోపంరాలేదు. పన్నెండుగురు ప్రధానులు శిలా ప్రతిమలవలె కూర్చొన్నారు. "నువ్వు అన్న మాటలకు శిక్ష 'మృత్యువు' కాని, నియమాను సారంగా నీకు 'క్షమ' బహుమతిగా ఇవ్వబడుతున్నది." అన్నాడు, నాయకుడు అదే గంభీరస్వరంతో.

నేను లేచి వచ్చేశాను.

పది సంవత్సరాలు గడిచిపోయాయి. ఎక్కడా ఆగకుండా, దేశమంతా తిరిగేను. ఆకలి దప్పికలు, శాంతి,

విశ్రాంతుల కొరకే చచ్చిపోయినట్లు కనిపిస్తున్నది. అంతే, యిప్పుడు నా నేత్రాలకు హృదయానికి ఆ వృత్తరమే వెలుగు. నాకు వారంటు వచ్చింది; మనస్సులో ఉరికంబం ఎక్కడా మనిపించింది. కాని, చచ్చిపోగానే ఆసజ్జనుని మరచిపోతాను. చనిపోవడంలో యిప్పుడు అంతగా సంతోష మేముంటుంది!" అనుకొన్నాను. ఏదో విధంగా ఎల్లకాలం బ్రతకాలనే కోరిక మనస్సులో నిలచి పోయింది. బ్రతికివుంటేనే, నేనతన్ని చూడ లేకపోయినా, కనీసం జాపకం చేసుకోగలను.

---

# శ్రీ రామ్‌చంద్ర శర్మ.

శ్రీ రామ్‌చంద్రశర్మ గారు ఆధునిక హిందీ కథా రచయితల్లో ఒకరు.

ఈయన కథలలో నిరాడంబరమైన శబ్ద ప్రయోగం, చక్కని వాక్య రచన, మృదుత్వము మనకు కన్పిస్తుంది. శైలి, సరళంగా వుంటుంది. ఈయన కథల్లో మంచిబిగివుండటం వలన పాఠకులు ఆతురతతో ముందుకు సాగి పోతుంటారు.

చిన్న విషయాన్ని కూడ మనోరంజకంగా, సులభ శైలిలో వ్రాసి, పాఠకుల హృదయాల్ని కదలించడమే ఈయన కథలలో వుండే ప్రత్యేకత.

# బాబూ! ఒక కాని!

మూలం : శ్రీ రామ్‌చంద్ర శర్మ.

వీరిని మీకు పరిచయం చేస్తాను. వీరు శ్రీ... ... ... అబ్బే ! పేరెందుకులెండి. ఈయన నన్నీ కథను వ్రాయడానికి ప్రేరేపించారు. ప్రభావతినుండి జనహారు వరకుగల రాజనీతి, శరత్ బాబు మొదలుకొని నేటి సోదరుల వరకుగల సాహిత్యం, కవుల బజారునుంచి నూనె కొట్లవరకు గల వ్యాపారచర్చ - ఏ విషయమైనా సరే, వీరు "నేను" ను "మేము" గా చేసి మాట్లాడ తారు. ఈ రోజులలో వీరు చాలగొప్పవారు. "మేము చాల పెద్దమనుష్యులము. కవిత్వంలో లక్ష ఏభై వేలు సంపాదించాము. గడచిన ఎన్నికలలో మేము యం. ఎల్. ఎ. కూడ అయ్యాము. సాహిత్య మంటారా?- అది మీ రెరుగుదురు. కావాలన్నచోట, అనుకున్నట్లుగా, వ్రాసినవన్నీ అచ్చు వేయ బడ్డాయి." అంటారు అంతే! అంటే, మనస్సులో రూపాయిలు, కలంలో సాహిత్యం, నాలుక మీద రాజనీతి - ఇది నా మిత్రులయిన వీరి పరిచయం.

ఒక రోజున షికారు వెళ్ళి వస్తున్నాము. తెలిసిన కిళ్ళీ కొట్టు కనుపించడం వలన, మేమిద్దరం నిలబడ్డాము. దూరంగా నిలబడివున్న అడుక్కునేపిల్లవాడు 'వీరు పెద్దమనుష్యుల్లా కనిపిస్తున్నా' రనుకొని, దగ్గరకు వచ్చి "బాబు, ఒక కాని!" అన్నాడు. నేనా బాలకుని పైనుండి క్రిందివరకు చూశాను.

దాదాపు ఎనిమిది - తొమ్మిది సంవత్సరాలుండొచ్చు; గాలిని కూడ కరిగించే బీద ఆకారం, మురికితో నల్లగా వున్న కాళ్ళు 'లివర్' కంటే వికృతంగా వున్న పొట్ట, మురికితో మలినమై, చినిగిపోయిన చొక్కా. తలమీద ఏమీలేదు. ముఖం మీద చిన్న చిన్న మశూచిక మచ్చలు, అణగిన ముక్కు, పెద్ద పెద్ద పెదిమలు, తెల్లని పళ్ళు; కాని, కళ్ళు మాత్రం నిజంగాకళ్ళే! అతను ఏమీ మాట్లాడక పోయినా అతని కళ్ళే "బాబు! ఒక కానీ!" అంటున్నాయి.

"నువ్వు చాల విచిత్రమైన వాడివే! ఇతన్నేమి చూస్తున్నావు? ఈ కిళ్ళీతీసుకో." అంటూ నా మిత్రుడు ఒక కిళ్ళీని యివ్వబోయాడు.

"అవి ఆయన వేసుకోరండీ. అదిమీకు. ఆయన 'బనారస్ జరదా' వేసుకుంటారు." అంటూ ఆ కిళ్ళీకొట్టువాడు మరొక కిళ్ళీని నాకు యిచ్చాడు. నా దృష్టి మరలకుండా వుండాలని ఆ పిల్లవాడు తిరిగి "బాబూ ! ఒకకాని!" అన్నాడు. నా మిత్రుడు ఒక తిరస్కార దృష్టితో అతనివంక చూచి, నన్ను హేళనచేస్తున్నట్లుగా "కానీ ! కానీ మాదగ్గర లేదు. అది ఈ బాబులదగ్గర వుంటుంది. మాదగ్గర రూపాయివుంది సరిగ్గా. కాని తక్కువ పదహారణాలు యిచ్చి రూపాయితీసుకో" అన్నాడు.

ఆ కిళ్ళీకొట్టువాడు నా కాతాదారుడు. నా మిత్రునికి సరిపోయేటట్లుగా "సేట్ గారు! ఛేంజ్ (Change) యివ్వనా ?" అన్నాడు. నేను నవ్వును అణచి పెట్టుకున్నాను. ఆ పిల్లవాడు

మళ్ళీ "బాబు! ఒక కాని!" అన్నాడు. అతనికి ఏమైనా యిద్దామనుకున్నాను. కాని, నా మిత్రుని బుద్ధి తెలుసుకోవాలనిమ్మందుకు నడచాను. మేము బయలుదేరాము. ఆపిల్లవాడు మమ్మల్ని వెంబడించాడు.

"కానీతక్కువ పదహారణాలుయిచ్చి రూపాయి తీసుకో." ఈమాటలు ఆ పిల్లవాడు వినలేదేమో! వినినప్పటికి దీనిఒత్తిడేకలుగలేదు. ఒత్తిడేమవుతుంది! కానీతక్కువ పదహారణాలు ఎక్కడనుండి తీసుకురావాలో అతనికి తెలియదు. అతను ఎక్కువ తీసుకుని తక్కువయిచ్చే "అర్థశాస్త్రవేత్త" లేక, "పెట్టుబడిదారుడు" కాడు. అతను అడుక్కునేవాడు. లేకపోతే అతనీ అవకాశాన్ని చేతులారా ఎందుకు జారవిడుస్తాడు! అతని తల్లి 'కానీ' అడగమని చెప్పింది. అతను 'కానీ' అడుగుతున్నాడు. కేవలం ఒక్క కానీ. "కానీ" టంకసాలలో తయారవుతుందో, పొదల్లో పెరుగుతుందో, కప్పు విరచుకుని ఆకాశంనుండి పడుతుందో అతనికి తెలియదు. "కానీ"యొక్క పుట్టు పూర్వోత్తరాలు అతను ఎరగడు. డబ్బువలన అవసరాలు పెరుగుతాయో, తగ్గుతాయో; వస్తువుల బేరం డబ్బుద్వారా ఎందుకు జరుగుతుందో, ఎలాఅవుతుందో – ఇవన్నీ అతనేమీ ఎరుగడు. ప్రజలు కోటీశ్వరులను, లక్షాధికారులను డబ్బున్నవారని ఎందుకంటున్నారు? రూపాయి లున్నవారని ఎందుకనడంలేదు! కానీతో రూపాయి తయారవుతుంతో, రూపాయితో కానులు తయారవుతాయో ___ ఇవన్నీ అతని బుద్ధికి మించిన విషయాలు. అతనికి 'కానీ' డబ్బుకోసం కాదు; అమ్మకోసం కావాలి.

ముందు మేము వెళుతున్నాము. వెనుక అతను వస్తు న్నాడు. మాలో ఎవరైనా అతనివంక చూస్తే "బాబు! ఒక కానీ!" అంటాడు. అతను యిప్పటివరకు రూపాయి చూడ లేదు. రూపాయిలవలన ఆకర్షణాలేదు; రూపాయిని అతను చేతిలో పెట్టుకుని తూచనూలేదు; పూర్తిగా తులం వున్న దాన్ని రూపాయి అంటారనికూడ అతనికి తెలియదు. దాని లో వెండి ఎందుకు తక్కువౌతున్నది? బూడిద ఎందుకు ఎక్కు వౌతున్నది?-ఇటువంటి ప్రశ్నలతో అతనికి సంబంధంలేదు. అతనికి "కానీ" కావాలి. అతను దానిని తల్లికివ్వాలి. అప్పు డామె తన అడుక్కునేకొడుకును "బంగారునాయనా!" అని, ఈ తెలివిగల ప్రపంచపు కానుక - సిగ్గుమాలిన బీదతనమును, ఒక ప్రత్యేక గర్వంతో సహిస్తుంది.

అతను మరల "బాబు! ఒకకానీ!" అని రెట్టించాడు. అతని స్వరంలో అదే సమానత్వము, అతని కళ్ళలో అదే మాట్లాడుతున్నట్లుండే దీనత్వము తాండవిస్తున్నాయి. స్వరాల ఆరోహణావరోహణాలు అతనికి తెలియవు. తెలుసుకోవాలని ప్రయత్నించడం లేదుకూడా. అతను స్వరశాస్త్రజ్ఞుల, స. రి. గ. మ విశారదుల జీవిత కుసుమాన్ని తన మూడు శబ్దాలతో (బాబు! ఒకకాని!) దోచుకుంటున్నాడు. "నీ తీగెల బిగింపు లో సమానత్వం లేకుంటే, వీణ వాగదు. నా స్వరాలలోని సమస్యను పరిష్కరించక పోతే, నీ కళ సార్థకమవదు, నీ కళ స్వాతంత్రాన్ని పొందలేదు." అని అతను చెబుతున్నట్లుంది.

"బాబు! ఒకకాని!" అని మళ్ళీ శబ్దం వచ్చింది.

"అ" నుంచి "జ్ఞ" వరకు గల వర్ణమాలతో "అజ్ఞాని" తయారవుతుంది. అది కర్త్రీలేని శబ్దమాత్రికుడికి నచ్చకపో వచ్చు. అతనుమాత్రం మాంత్రికుడు కాదు. అతనికిమంత్రాలు రావు. అతను ఈశ్వరుని కుమారుడు. చాల గొప్పవాడు. ఇది నిజం. చెప్పాలనుకున్నదే చెబుతాడు. అనవసరపు పోటీలు, ఉదాహరణలు, విశేషణాలు అతనికి అక్కరలేదు. అతనికి ఊతగా నిరాడంబరమైన భాషవుంది. అతనికి ఒక మంత్రం వచ్చు. ఒకేమంత్రం. అతనికి చదవడమూ రాదు, వ్రాయడమూ రాదు; కాని "నా సమస్యను పరిష్కరించ కుండా, స్వేచ్ఛను పొందలే"వని చదువుతున్న విజ్ఞానవేత్తలకు గొప్ప గొప్ప సాహిత్యనిపుణులకు, పండితులకు చెప్పాలను కుంటున్నాడు. అతనికి "కాసు" నిత్యసత్యమన్నట్లు, అతని మంత్రం చావును కూడ జయిస్తుందన్నట్లు, ఏకధాటిగా మాట్లాడుతున్నాడు. దానిలో శాంతి అహింస, అపరిగ్రహాలు లున్నాయి. ఒకస్వరం, ఒకలక్ష్యం, ఒకబలం, ఒకముద్ర, ఒక సాధన – అతని తపస్సువలన ఇంద్రాసనం కదులుతుందా అన్నట్లుంది. భగవంతుడు చూస్తున్నాడు, భూమి అరుస్తూ వుంది "బాబూ! ఒకకాసు!"

మేము చాలదూరము వచ్చాము. అతనుకూడ మా వెనుకనే పూర్వజన్మ సంస్కారంలా వస్తున్నాడు. కాని, అతను యింతదూరం వెంబడించడం నా మిత్రునికి నచ్చలేదు. "అబ్బ! ఈ భిక్షుకుల సమస్య రోజురోజుకు ఎంత గడ్డుగా పరిణమిస్తు న్నది! ధనమధాంధత, పారిశ్రామిక సత్యాగ్రహం చూశాము.

కానీ నిరుద్యోగులైన ఈ భిక్షకుల మొండిపట్టు చూడలేక పోతున్నాము.'' అని, పిల్లవాని వంక చూచి, కళ్ళెర్రజేస్తూ ''ఫో, దుర్మార్గుడా!'' అన్నారు.

మేము మరికొంచెం ముందుకు వెళ్ళాము. అతనుకూడా వస్తూనేవున్నాడు. ఈసారి ఆయన నాతో ''అబ్బ! వీడు పెంపుడు కుక్కలా నడుస్తూ వస్తూనే వున్నాడు.'' అన్నారు.

ఆ పిల్లవాడు మరల ''బాబు! ఒకకానీ!'' అన్నాడు.

ఈ పర్యాయం ఆయన స్పష్టంగా ''వీడిమీద దయ చూపితే, విషయం యింకా పెరుగుతుంది, కాని తగ్గదు. ఇది దానం పేరుమీద జరిగే దురుపయోగం. వీడికి ''కానీ''యివ్వడం పాపం. మహాపాపం.'' అన్నారు.

భిక్షకుని మొండిపట్టు; పో దుర్మార్గుడా, పెంపుడు కుక్క. దానంపేరు మీద జరిగే దురుపయోగం! పాపం!! మహాపాపం!!

నా మిత్రుడు ఎన్నికల రోజులలో అనేక సభలలో మాట్లాడేరు. భావ పరంపరలు కరతాళ ధ్వనుల్లో లీనమైపోయాయి. కంఠం పూలమాలల్లో చిక్కుకొంది. అభ్యాసం వలన వేడెక్కి, వూతగా జారిన ప్రతి శబ్దం చరిత్రగా తయారయింది. ప్రతివాడిని 'నారాజా' అని ముఖస్తుతి చేశారు. 'నారాజా! కేవలం ఒక ఓటు!' అది పాపం కాదు? ఈ ''బాబు! ఒకకానీ!'' పాపం! దానం పేరుమీద జరిగే దురుపయోగం! నాకు నా మిత్రుని బుద్ధి చూచి జాలి వేస్తున్నది పాపం! ఆ పిల్లవాడు యిప్పుడు కూడ తన మంత్రాన్ని అలాగే జపిస్తున్నాడు.

అతను నెమ్మగా మాట్లాడడానికి అతని మంత్రంలో మోసకల్మషాలు లేవు. కలిమిలేముల ప్రహారిగోడల్లో బంధితులైన మానవుల పాప పుణ్యాలకు దూరంగా - చాల దూరంగా వుంది. అతని మంత్రం అతను మళ్ళీ "బాబు! ఒక కాని!" అన్నాడు. ఈ సారి చేయి చాపడంలో, తెలియకుండానే, ఆ బీద వాని చెయ్యి, నా మిత్రుని పొడవైన ఇద్దరు చొక్కాకు తగిలింది. నామిత్రుని రెండుచేతులు హద్దుమీరి పోయాయి. ఒక చేతితో చెవి పట్టుకొని, రెండవ చేతితో చెంపమీద వాయించారు.

ఆ అమాయకుడు ఇప్పుడుకూడ "బంగారు కొడుకా." అనిపించుకునే స్వప్నంలో మునిగివున్నాడు. ఇప్పుడతనికి చెంప దెబ్బ దొరికింది; 'కానీ' పుచ్చుకోవడం యింకా మిగిలి వుంది. 'అబ్బ!' అనలేదు, కదలనూలేదు. ఒక్క సారి మాత్రం కళ్ళు మూసుకుని మళ్ళీ తెరచాడు. కళ్ళు మూసుకుని అతనేమి చూశాడో, ఏమి చూడకుండా వుండాలను కున్నాడో, అతని అంతరాత్మకే తెలియాలి. కాని, అతని కండ్లు అశ్రు పూరితాలయిన మాటనిజం. అతని చీము కారుతున్న కురుపు మీదనున్న ఈగను తోలడానికే నా మిత్రుడు చేతులు కదిపి నట్లుగా, అతని ముఖం మీద ఏ మార్పూ కలగలేదు. చెవులు కూడా అలాగే వున్నాయి. కొంచెం ఎర్రబడ్డాయేమో! కాని, కారు నలుపువాడేగా! ఒక గొప్ప వ్యక్తికి సంబంధించిన సుకుమార పుత్రుడు మాత్రం కాడు. పైగా నామిత్రుడు అతనిమీద చాల దయ చూపేరన్నట్లుగా, అతని కళ్ళలోంచి ఏంత భావాలు పొంగుతున్నాయి. అతను మళ్ళీ అదే

స్వరంలో "బాబూ ! ఒక కానీ !" అన్నాడు. స్వరంలో ఏ మాత్రం వణుకు లేదు, శిథిలత్వం లేదు, జయాపజయాల శాంతి - క్రాంతులు లేవు, హెచ్చు తగ్గుల బంధన లేదు. అతని తల్లి అతనితో "ఎవరైనా ప్రేమిస్తే నవ్వవద్దు. ఎవరైనా హీనంగాచూస్తే చెడ్డగా భావించవద్దు. ఎవరైనా కొడితే ఏడ్వవద్దు. పైవాడు అన్నీ చూస్తుంటాడు. అతడు ఏదో ఒక రోజున భూమి మీదకు వచ్చి అన్నీ సరిచేస్తాడు. మనము ఏడ్వము. ఏడ్వటము మరచి పోయాము. పాపం చేసిన వాళ్ళు ఏడుస్తారు. మనము అడుగుతున్నాము; పాపం చేయడం లేదు, దోచుకోడము లేదు, జేబులు కత్తిరించడం లేదు, దొంగతనం చేయడం లేదు." అని చెప్పింది.

అతను మరొక సారి "బాబు ! ఒక కాని !" అని రెట్టించాడు. ఈసారి నేను భయపడ్డాను. నా మిత్రుడు అతన్ని ఘోరంగా శిక్షించరు గదా ! నాకు చాల కంగారు పుట్టింది. వెంటనే అతని కుడిచేతిలో రెండు 'కానులు' పెట్టాను. అతను ఒక కానీని ఎడమ చేతితో పట్టుకుని, రెండవ కానీని నా మిత్రుని ముఖం మీదకు, శవంమీద విసరి కొట్టినట్లు, విసరి కొట్టాడు. బ్రతికి వున్న నామిత్రుని మీద విసరిన 'కానీ' ఆయన తెల్లని టోపికి తగిలి భూమిమీద పడిపోయింది. అతని గతిననుసరిస్తూ మాకన్న ముందుకు వెళ్ళిపోయాడు. "బాబు ఒక కాని !" అని శబ్దం చేసుకుంటూ, బహుశా అతను తెలియని దిశవైపుకు వెళ్ళిపోతున్నాడు.

ఆ పిల్లవాడు మాకు కొంచెం దూరంముందు పరుగెత్తుకుంటూ వెళ్ళి, తల్లి ఒడిలో దాక్కొన్నాడు.

# పం. గోవింద వల్లభ్ పంత్

శ్రీ గోవింద వల్లభ్ పంత్ హిందీ సాహిత్యవేత్తలలో చాల ప్రసిద్ధికెక్కిన పండితులు. వీరు యు. పి. ప్రాంతములోని గఢ్‌వాడ్ నివాసస్థులు. వీరు తమ జీవితాన్ని పూర్తిగా సాహిత్యసేవకు అర్పించారు.

వీరు అనేక కథలు, నవలలు, నాటకాలు వ్రాశారు.

వీరి కథలలో మధురమైన శబ్దాలు, ఉత్తమ ఆశయాలు తొణికిసలాడుతుంటాయి. శైలి సరళంగా, మనోహరంగా వుంటుంది.

# తొలి చూపు

మూలం · పండిత్ గోవింద వల్లభ్ పంత్.

వాసవదత్త సౌందర్యం పూర్ణచంద్రుని కంటెనుకూడ పరిపూర్ణమైనది. ఆమె దేహాము కమలముకన్న చాల కోమల మైనది. ఆమె వాణి వీణను తిరస్కరించేది. ఆమె లజ్జాపూరిత నయనాలు లేడిని సిగ్గుపరచేవి. స్వర్గసౌందర్యం తన కోరిక ననుసరించి, స్వహస్తాలతోనే ఆసజీవ స్వర్ణప్రతిమను నిర్మించి నట్లుంది! ఇటువంటి జగన్మోహన శోభను, యింతటి అంద మైన రూపమును ప్రసాదించికూడ, విధాతకు, ఆమెను వేశ్యగా సృష్టించుట తగునా? బురదలో కమలమును, ముళ్ళలో పూలను వికసింపజేయువాడే ఎరుగును!

బాలవసంతుని శోభాయమానమైన ప్రభాతములో కోయిలయొక్క కరుణాగానము హృదయమున కత్తుకొని, మలయ సుగంధపవనము తన ఇచ్ఛానుసారముగా వీచుచుండు నపుడు ఒక బౌద్ధసన్యాసి వాసవదత్త యొక్క విశాలమైన సౌధ ద్వారము వద్ద భిక్షకొరకు వచ్చి నిలచాడు. అకస్మాత్తు గా వాసవదత్త దృష్టి ఆ బౌద్ధ సన్యాసివైపుకు మరలింది. ఆమె అతనిని ఒకపర్యాయం చూచింది; వంద పర్యాయములు చూ చింది—చూస్తూ నేవుంది.

అతనిపేరు ఉపగుప్తుడు. ప్రాపంచిక దృష్టిలో అతను భిక్షుకుడు. కాని, స్వర్గీయ దృష్టిలో అతనే రాజరాజేశ్వరుడు. మనస్సుకంటె అతి శ్రేష్ఠమై విస్తృతమైన రాజ్య మేదీ లేదు.

ఆ మనస్సు మీఁదనే ఉపగుప్తుడు విజయాన్ని సంపాదించాడు. అతను రాజేశ్వరుడు. ఇంద్రియాలన్నీ అతని ప్రజలు.

శాంతిరహిత, చంచలవిశ్వాన్ని అతను బాగా గ్రహించాడు. అతని కండ్లు స్థిరశాంతి కలవి. అతని ముఖమండలమున స్వర్గీయ దివ్యశోభ గోచరిస్తున్నది. కాషాయవస్త్రము లతనికి అపూర్వశోభను ప్రసాదిస్తున్నాయి.

ప్రపంచాన్ని తన సౌందర్యంతో ఓడించగల వాసవదత్త ఆ బౌద్ధసన్యాసి ఎదుట ఓడి పోయింది. అతని సౌందర్యాన్ని చూచి ముగ్ధురాలయింది. ఆమె పట్టుచీర కొంగుజారిపోయింది. ఆమె వాలుజడ శిథిల మయింది. దానిలో కూర్చబడిన పుష్పరాశి ముక్తినొంది భూమిపై పడిపోయింది.

ఆమె ఉపగుప్తుని దగ్గరకు వచ్చి "భిక్షుకుడా! భిక్షాపాత్రను ముందుకుచాపు," అంది.

ఉపగుప్తుడు భిక్షాపాత్రను ముందుకు చాపుతూ, అకస్మాత్తుగా, ఆశ్చర్యముతో "కాని, నీ చేతులు ఖాళీగా వున్నాయి. ఇవి నాకేమి యివ్వగలవు?" అన్నాడు.

వాసవదత్త:-"ఈ చేతులు నేటివరకు యితరు లెవ్వ యివ్వని, నీకీ ప్రపంచములో ఎక్కడా దొరకని వస్తువును యిస్తాయి."

ఉపగుప్తుడు:-"అంటే?"

వాసవదత్త:-"ఇవి రిక్తహస్తాలు కావు."

ఉపగుప్తుడు:- "నే నీ స్వర్ణభూషణముల నేమి చేసుకొందును?"

వాసవదత్త:-"నేనీ స్వర్ణభూషణముల మాట చెప్పట లేదు. వైరియువకుడా! ఇవి రిక్తహస్తాలు కావు. ఇవి ప్రేమా లింగనాలతో పరిపూర్ణముగా నున్నాయి. నేను ఆ ఆలింగన మునే నీకు యిస్తాను-చూడు, భిక్షు! ఏ వాసవదత్త ఛాయా స్పర్శకైతే గొప్ప గొప్ప రాజరాజేశ్వరులు వ్యాకులపడు చున్నారో, ఆమె నీకు ప్రేమాలింగన మివ్వడానికి సిద్ధముగా వుంది."

ఉపగుప్తుని ముఖభంగిమ అసలు పరివర్తన జెందలేదు. వాసవదత్త తిరిగి "భిక్షాపాత్రను ముందుకుచాపు. నీకు భిక్ష లో నాహృదయాన్నిస్తాను" అంది.

ఉపగుప్తుడు:-"అంటే ?"

వాసవదత్త:-"అంటే...నీ ఈసుకుమార దేహం భిక్షా వృత్తికి కాదు. ఈ సాటిలేని సౌందర్యకుసుమం, సంసార స్పర్శకు దూరమై అడవులలో వాడిపోవుటకు కాదు. రా భిక్షు నా ఇంటికిరా. నేను విశ్వానికి రాణిని; నీ దాసి నవుతాను"

ఉపగుప్తుని ముఖమండలములో గూఢమైన కోరిక ప్రభావమువలన చిరునవ్వు యొక్క ఒకక్షీణరేఖ కనుపిం చింది. అతను మాట్లాడలేదు.

వాసవదత్త:-"చెప్పు. బౌద్ధసన్యాసి!" అంది వ్యాకు లతతో.

ఉపగుప్తుడు:-"కాని, కొన్ని కారణాలవలన యిప్పుడు సమయం లేదు."

వాసవదత్త:-"అయితే ఎప్పుడు ?"

ఉపగుప్తుడు:-"తిరిగి కొన్నిరోజుల తరువాత వస్తాను."

"తిరిగి కొన్నిరోజుల తరువాత వస్తాను."—వాసవదత్త తనలో తా నాలోచింప నారభించింది.—"రమణి రూపానికి అవమానమా ! ఒక బౌద్ధసన్న్యాసి నాసౌందర్యాన్ని తిరస్కరించుటా ! చూడనచ్చు ! నే నా రోజుకోసం ఎదురు చూస్తాను."

ఉపగుప్తుడు శీఘ్రగతితో బౌద్ధసన్న్యాసుల నివాసం వైపుకు వెళ్ళిపోయాడు. వాసవదత్త స్వర్ణప్రతిమలా నిశ్శబ్దంగా, నిశ్చలతతో అతన్ని చూస్తూనే వుండిపోయింది.

## 2

తన చిన్న జీవితపు ఒక ప్రకాశమును చూపి సంధ్య తీవ్రగతితో వెళ్ళిపోయింది. శరత్కాలపు స్వచ్ఛాకాశంలో తూర్పున ఉదయోన్ముఖుడైన చంద్రుని కిరణాలు ప్రకాశవంత మైన వెన్నెలను వెదజల్లుతున్నాయి.

దట్టమైన వనచరణములను కడగుచు, కలకలధ్వనితో గంగానది ప్రవహిస్తున్నది. పగలంతా భిక్షాటనా భారముతో కూడిన ఉపగుప్తుడు ఆ వనమునుండి తనమఠానికి వెళ్ళుచున్నాడు.

భయంకర హింసాపశువైన సింహంపై కరుణావతారు డైన బుద్ధభగవానుని ఉపదేశప్రభావ మేమీ పడలేదు. దాని రాక్షస ప్రవృత్తిలో పరివర్తన కలుగలేదు. ఉపగుప్తుడు

వచ్చుట చూచి సింహము అతివేగంతో అతనిపై కురుకుటకు సిద్ధపడింది. ఇదిచూచి బౌద్ధసన్యాసి తనశిరస్సును వంచి వేశాడు.

ఒకవైపు సింహం ఉపగుప్తుని భక్షించడానికి సిద్ధంగా వుంది. రెండవవైవు ఉపగుప్తుడు సింహానికి ఆహారంగా తయారై నిలబడి వున్నాడు.

దగ్గరే దట్టమయిన ఒక చిన్న పొద వుంది. ఆ పొద మధ్యలో ఒక రంధ్రముంది. వసంతఋతువు పూర్తి గడువులో శక్తికొలది ప్రయత్నించినను, ఆకులు దానిని కప్పలేకపోయాయి. ఆరంధ్రంనుండి ఒక వ్యాధుడు ఆ భయంకర దృశ్యాన్ని చూశాడు.

సింహం బౌద్ధసన్యాసి మీాద కురకడానికి సిద్ధంగావున్న సమయంలో వ్యాధుడు తన ధనస్సులో బాణాన్ని ఎక్కించి, ఎదుటి పొదవృక్షాన్ని చీల్చి, సింహాన్ని భూమిపై పడవేశాడు.

ఉపగుప్తుడు వ్యాకులతతో నాలుగువైపులా చూశాడు. తన కార్య సఫలతకు నవ్వుచూ, ధనస్సును ధరించిన వ్యాధుడు అటే వస్తున్నాడు.

బౌద్ధసన్యాసి విచారంగా, వ్యాధునితో - "అయ్యా! ఇలా చేశావేమి? సింహం నీకేమి అపకారం చేసింది? అకారణంగా నిరపరాధిని ఎందుకు హత్య చేశావు?" అన్నాడు.

వ్యాధుడు తనలో తానాలోచించాడు- "సింహం నిరపరాధియా?"

తన దయా హీన కఠోర జీవితంలో వ్యాధుడు మొట్టమొదటిసారిగా యిక్కడే కరుణాదేవిని దర్శించాడు. అతను చిత్రాంకిత మూర్తిలా కొంతసేపు నిలచిపోయాడు. ఉపగుప్తుడు అతనిపై కరుణాప్రపూర్ణ దృష్టిని ప్రసరింపజేశాడు. కళ్ళు కలుసుకొన్నాయి; హృదయం; హృదయం నొక్క సందేశాన్ని గ్రహించింది.

వ్యాధుని రెండుచేతులు కంపించినయ్. అతను భుజం నుండి అమ్ములపొది తీసి గంగానది మధ్యకు విసిరివేశాడు ... అతని నిర్దయత్వం గంగానదిలో కలసిపోయింది. తన బలిష్ఠమైన చేతులతో ధనస్సును రెండు ముక్కలు చేసి, భూమి మీద కొట్టాడు – అతని కఠోరత్వం అంతిమ శ్వాస తీసుకొన నారంభించింది. తరువాత వ్యాధుడు బౌద్ధసన్యాసి కాళ్ళపైబడి – "దేవా! ఇదే నా అంతిమ హత్య" అన్నాడు.

ఉపగుప్తుడు ప్రసన్నముఖంతో ఆశీర్వదించాడు. వ్యాధుడు నూతన ప్రపంచంలో ప్రవేశించడానికి వెళ్ళిపోయాడు. "కరుణ" అతనికి పథప్రదర్శినిగా తయారయింది.

దయామయుడైన ఉపగుప్తుడు భూమిపైబడిన సింహం వైపుకు చూశాడు. దాని ఛాతీలో బాణం చాల కఠోరంగా దూరివుంది. బౌద్ధసన్యాసి దానిని అతి కష్టంమీద గంగానది ఒడ్డుకు తీసుకొనిపోయి, దాని గాయాన్ని కడుగనారంభించాడు.

గంగానది చంచల హృదయంలో దశదిశలయందు అమృతాన్ని వర్షింపజేస్తూ ఒకనావ పోతూవుంది. శరచ్చంద్రుని నిర్మలమయిన వెన్నెల అతిరమణీయముగా వుంది.

ఉపగుప్తుడు తనపనిలో మునిగిపోయాడు. సింహం జీవిస్తుందనే ఆశ చాలతక్కువగా వుంది. అయినప్పటికీ బౌద్ధ సన్యాసి నిమగ్నతతో తనపని నిర్వర్తిస్తున్నాడు.

నావ అటే వస్తూవుంది. ఇప్పుడు గానస్వరం ఉపగుప్తునకు స్పష్టంగా వినిపిస్తూవుంది. నావలో ఇతరు లెవరూ లేరు. ఆ అతిరూపసియైన వాసవదత్తే తల విరబోసుకొని శరచ్చంద్రునితో కళ్ళను కలుపుతూ పాడుతున్నది. బౌద్ధసన్యాసి సింహం ఛాతీనుండి బాణము బయటకు తీయుటానికి చేయి ముందుకు చాచాడు. అకస్మాత్తుగా పాట ఆగిపోయింది. నావ బౌద్ధసన్యాసి దగ్గరకు వచ్చింది.

నావలోనుండి వాసవదత్త వ్యాకులతతో అరచింది - "భిక్షు! ఏమి చేస్తునావు? ప్రాణలాభమును పొంది, ఈ భయంకర హింసాపశువు తన ప్రాణదాతను గుర్తించదని నీకు తెలియదా? ఇది నిన్ను సర్వనాశనం చేస్తుంది."

ఉపగుప్తుడు:- "రమణీ! నీవు పొరబడు తున్నావు. బాహ్య సుందర హింసాపశువులకన్న, ఇది ఎక్కువ భయంకరమైనది కాదు. ఏ పెదిమలలోనైతే, మనుష్యత్వము యొక్క శత్రువు "కామము" దానిని వధించడానికి ప్రబలప్రయత్నంగా నిలచిందో, ఆ సుందర రూపముకంటె ఇది ఎక్కువ భయంకరమైనదికాదు. తన బంధముతో మనుష్యులను ఖైదీలగా తయారుచేసే సుందర "మోహము" కన్న ఇది ఎక్కువ భయంకరమైనదికాదు. చేతిలో స్వర్ణముకుటమును దాల్చి, ఏడవలెదేని వెనుకనైతే మనుష్యులు తమ లక్ష్యాన్ని, ధర్మాన్ని మరచి

ఎన్నో జన్మలు, జగత్తులు తిరుగుతున్నాగో ఆ నిస్సార "లోభము" కన్న ఇది ఎక్కువ భయంకర మైనదికాదు."

వాసవదత్త ఏమీ తెలుసుకోనలేక పోయింది. ప్రేమ వలన వ్యాకులపడుతూ "భిక్షు! నిన్ను నిరీక్షిస్తూ వుండిపోయాను. నీవు రాలేదు. మరచిపోయావా?" అంది.

ఉపగుప్తుడు:- "లేదు మరువలేదు. కొన్ని రోజుల తరువాత వస్తాను."

వాసవదత్త:- "నేడే రా భిక్షు! ఇంతకన్న మంచి సమయం ఎప్పుడొస్తుంది! నేడు చంద్రుడు ప్రపంచాన్ని ప్రకాశవంతంగా చేస్తున్నాడు. నీవు నాగృహాంధకారాన్ని దూరము చేయి."

"ఆగు" అంటూ బౌద్ధసన్యాసి సింహం ఛాతీ నుండి నెమ్మదిగా బాణం తీయనారంభించాడు.

వాసవదత్త:- "నీవు నీసౌందర్య బాణంతో నన్ను గాయపరచావు. ముందు నాకు ప్రాణదానం చేయి."

ఉపగుప్తుడు:- "ధైర్యంగావుండు సుందరీ! నేను తప్పక వస్తాను."

వాసవదత్త:- "ఎప్పుడు వస్తావు? నిన్ను నిరీక్షిస్తుండగా నా నేత్రజ్యోతి ఆరిపోయిన తరువాతా? రోజులు లెక్కిస్తుండగా, కాలము నా నుండి యౌవనాన్ని అపహరించిన తర్వాతనా?"

ఉపగుప్తుడు ఆమె వంకచూచి ఆలోచించాడు - "అయ్యో! ఇదేమి! ఇంతజ్ఞాన మున్నప్పటికీ, ఈమె అగాధంలో పడుతుందే!"

వాసవదత్త తిరిగి "ఎప్పుడు వస్తావు?" అంది.
ఉపగుప్తుడు:- "ఈ జీవితంలో"
వాసవదత్త:- "ఈజీవితంలోనా? ఇదిచాలపెద్దగడువు?"
ఉపగుప్తుడు - "అయితే!"
వాసవదత్త:- "ఈక్షణమే అను."
ఉపగుప్తుడు - "అబ్బే!"
వాసవదత్త:- "ఈమాసములోనే."

ఉపగుప్తుడు:- "ఈ సంవత్సరములో వస్తాను. ఇది నిజం."

వాసవదత్త:- "నేను [వేళ్ళపై రోజులు, శ్వాసలో క్షణాలు లెక్కిస్తుంటాను."

వాసవదత్త వెళ్ళిపోయింది. ఉపగుప్తుని మృత్యుముఖంలో నున్నసింహం హృదయమునుండి బాణంతీయడం లో నిమగ్నుడయాడు.

## 3

శరదృతువు వెళ్ళిపోయింది; శశిరఋతువు వెళ్ళిపోయింది; హేమంతఋతువు వెళ్ళిపోయింది. కాని, ఉపగుప్తుడు రాలేదు. వాసవదత్త అనేకసార్లు కన్నీటితో నిరీక్షించింది.

కాని అతను రాలేదు. ఆమె ఎన్నో పర్యాయాలు అలంక రించుకొంది, కాని అంతా వృథాఅయింది.

ఆఖరికి, సుగంధిత సుమనస్సంజీవిని తీసుకొని వసంత ఋతువు వచ్చింది. అయినప్పటికీ అతను రాలేదు. చూస్తూ వుండగా గడువుకూడ పూర్తి అయింది. కాని, ఉపగుప్తుడు రాలేదు. వాసవదత్త దీక్షాపూరిత నేత్రాలతో అసలు రానటు వంటి అతని మార్గాన్ని చూస్తూవుంది. అందరూ వచ్చారు; ఒక్క ఉపగుప్తుడు మాత్రము రాలేదు.

గడువు పూర్తికావడానికి రెండుమాసాలున్నాయి— ఒకమాసముంది. ప్రపంచ సత్రంలో ఆగిన "సంవత్సర" మనే బాటసారి వెళ్ళడానికి సిద్ధంగా వున్నాడు. అతను శిశిర శాలు వాను భుజంమీద వేసుకొన్నాడు; హేమంత పసుపును చుట్ట బెట్టాడు; వసంత-పుష్పవస్త్రాల్ని చక్క బెట్టాడు. గ్రీష్మగొడు గును చేతియందు, చెప్పులు పాదాలయందు ధరించాడు. వర్షపు ఖాళీచెంబు, తాడును కూడ తీసుకొన్నాడు. అతను తన అంతిమవస్తువు, శరత్ జ్యోత్స్నను చుట్టబెట్టడానికి చేయి చాచగానే, వాసవదత్త నిస్పృహతో — "నిజముగా నా ప్రియుడు ఈ సంవత్సరం రాడా?" అంది.

రాత్రిసమయం. భూదేవి అంధకారంలో మునిగివుంది. వాసవదత్త అంతఃపురం ఎన్నో వేల దీపముల ప్రకాశంతో మెరుస్తూవుంది. దీపపు కిరణాలు ఆమె స్వర్ణభూషణాలలో ప్రతి బింబించి, ఆమె విలాసస్థలానికి అపూర్వశోభను ప్రసాదిస్తు న్నాయి. సంఖ్యాతీతమైన దీపాలు నక్షత్రాలలా వున్నాయి.

వాటిమధ్య వాసవదత్తముఖము చంద్రునివలె శోభాయ మానముగా వుంది.

ఆ రోజున వాసవదత్త యింటిదగ్గర ఉత్సవం. ఆ ఉత్స వం ఆమె ప్రేమికుడైన ఒకలక్షపతి స్వాగతార్థం నిర్మించ బడింది. ఒక వైపునుండి సంగీతం, రెండవ వైపునుండి సుర ధారలు ప్రవహిస్తున్నాయి. మధ్యలో అభాగ్యుడైన లక్షపతి మునిగిపోయాడు.

అర్ధరాత్రి కాకముందే లక్షపతి సురాప్రభావం వలన పూర్తిగా స్పృహతప్పి పడిపోయాడు. అతనికి, తన యితర ఏమీ గుర్తులేదు. సంగీతం ఆగిపోయింది. దాసీలు, పరిచారి కలు అందరూ వెళ్ళిపోయారు. గదిలో లక్షపతి, వాసవదత్త మినహా ఎవరూలేరు. అబ్బే! మరొకపిశాచి కూర్చొనివుంది. ఎవరది? వేశ్య వాసవదత్తయొక్క నీడ.

వాసవదత్త నాలుగుమూలలు చూచి, తన పరుపు తల క్రిందిభాగమునుండి ఒకకత్తి తీసింది. రాత్రి సమయమందు ఒక వేశ్య చేతిలో కత్తి! ఆమె ఏమి చేయ సంకల్పించింది? సంగీతసుధను వర్షించు ముఖచంద్రం వజ్రాన్నికూడ వేస్తుందా?

ఆమె స్పృహతప్పిపడిన లక్షపతినిచంపడానికి ముం దుకు నడచింది—"జాగ్రత్త! పైన భగవంతుడున్నాడు. అతని కైనా భయపడు," అన్నట్లు ఆమె కత్తివున్న చేయి ఆకాశం వైపుకు లేచింది. నిర్దయురాలు ఆ చేతి మూగసంజ్ఞను గుర్తించ లేకపోయింది. ఆమె ఆ కత్తిని లక్షపతిఛాతీలో గ్రుచ్చింది.

లక్షపతి అరచాడు. అతని అంతిమశబ్దాలు—"అబ్బ! మోస పిశాచిని."

రూపముతో గూడిన రాక్షసి - సుకుమార పిశాచిని - తన విజయానికి సంతోషించింది. ఇదే సమయంలో ఎవరో బయటనుండి కరుణాపూరిత కంఠంతో పిలిచారు-"వాసవదత్తా!"

వాసవదత్త వణుకుతూ, గవాక్షద్వారం తెరచి "ఎవరు?" అంది. కాని, సమాధానం అవసరం లేకపోయింది. గవాక్ష ద్వారంనుండి గదిలోనున్న దీపపుకాంతి ఆ వ్యక్తి ముఖమండలంమీద ప్రసరించింది—అతను బౌద్ధసన్యాసి-ఉపగుప్తుడు.

వాసవదత్త సంతోషంతో —"భిక్షు! నీవు వచ్చావా?" అంది.

ఉపగుప్తుడు:-"లేదు, కాని త్వరలో వస్తాను."

వాసవదత్త:-"అయితే, ఈ చెడుసమయంలో ఎందుకు వచ్చావు?"

ఉపగుప్తుడు:-"అబ్బే! ఏమీలేదు. నేను మఠానికి వెళ్ళుతున్నాను. ఇక్కడ నీవు జ్ఞాపకమువచ్చావు. నీవు నిద్రిస్తున్నావో, మేల్కొన్నావో తెలుసుకోవాలని నాకుఉత్సాహం కలిగింది"

వాసవదత్త:-"నేను మేల్కొనేవున్నాను."

ఉపగుప్తుడు:-"కాని నీ రెండుకళ్ళు మూసుకునేవున్నాయి. మంచిది - వెళుతున్నాను. ఈరోజు నాకు చాల ఆలస్యమయింది."

వాసవదత్త:–"ఆగు. నీకు నీ ప్రతిజ్ఞ జ్ఞాపకముందా?"

ఉపగుప్తుడు:–"ఆఁ వుంది."

వాసవదత్త:–"నీవు ఈ సంవత్సరములోనే నన్ను కలుసుకొంటానని మాటయిచ్చావు."

ఉపగుప్తుడు:–"ఇంకా సంవత్సరానికి ఎన్నిరోజులు మిగిలివున్నాయి?"

వాసవదత్త:–"కేవలం ఒకపక్షం."

ఉపగుప్తుడు:–"నేను ఈ గడువులోపల వస్తాను."

వాసవదత్త:–"నీవు అబద్ధం చెబుతున్నావు; నన్ను మోసగిస్తున్నావు."

ఉపగుప్తుడు:–"బుద్ధదేవుని శిష్యుడు అబద్ధం పలుకడు. మోసకల్మషాలు అతని ధర్మాలుకావు."

ఉపగుప్తుడు గంభీర అంధకారరాత్రిలో కలసి అదృశ్యమయ్యాడు. వాసవదత్త గవాక్షద్వారం మూసుకొని దాక్కొంది.

## 4

వాసవదత్త ధనకాంక్షతో లక్షపతిని వధించింది. రహస్యం వెల్లడైపోయింది. న్యాయాలయంలో విచారణకు హాజరు చేయబడింది.

ఆమె ధనం ఆమెకుపయోగపడలేదు. ఆమె ప్రేమికులు ఆమెకేమీ సహాయపడలేదు. ఆమె సాటిలేని సౌందర్యం కూడ ఆమెను దండననుండి ముక్తురాలిని చేయలేకపోయింది.

అభాగ్యురాలకు న్యాయాలయంలో ఉరిశిక్ష దొరుక లేదు. ఆమె అంశాతి జీవితానికి ప్రాణదండన శాంతివంతమైంది. అది దండనకాదు; ఆశీర్వాదము. ఆమెరూపం వికృతంగా చేయ బడింది. ఆమె చంద్రవదనపు కళ్ళు తీయబడ్డాయి. ముక్కు, చెవులు కోయబడ్డాయి. ఆమె కమలకాడలవంటి కరాలు నరక బడ్డాయి. ఆమె ధనసంపత్తి లాక్కొన బడింది.

ఈ భయంకర శిక్షను విధించుచున్నప్పుడు వాసవదత్త అతి దీనస్వరంతో ప్రార్థించింది - "నేనొక వారం రోజులు గడువు కోరుతున్నాను. నేనొక ప్రియుని కలుసుకోవాలి అతను ఈ వారంలో వస్తాడు. అతరువాత చాల ఆనందంగా ఘాత కుని చేతులకు, న్యాయకరవాలానికి నాదేహం అర్పిస్తాను."

ఆమె విన్నపాన్ని ఎవరూ ఆలకించలేదు. ఘాతకులు వాసవదత్తను కురూపిగాచేసి, రాజబాటమీద విడచిపెట్టారు. ఆమె పాపపు కథను ప్రజలందరకు వినిపించడానికి ఒకవ్యక్తి నియమింప బడ్డాడు.

ఎంత భయంకర బీభత్స దృశ్యం? ఆమె గాయాల నుండి రక్తం, చీము కారుతున్నది. దానిపైన ఈగలు 'భినభిన' మంటున్నాయి. చేతులు లేకపోవడం వలన, అభాగ్యురాలు వాటిని తోలలేక పోతున్నది. ఆమె కేవలం కరుణ స్వరంతో ఏడుస్తూవుంది.

నేటివరకువున్న ఆమె సౌందర్యోపాసకులంతా ఇప్పు డు ఆమెను అసహ్యించుకొంటున్నారు, దూరంనుంచే పారిపో

తున్నారు. అందరూ ఆమెమీద ఉమ్మి వేస్తున్నారు. అసమర్థుడు, కుంటి, గ్రుడ్డి, రోగి, అయిన – ఒక భిక్షుకుడు కూడ దారి వెంటపోతూ ఆమె స్పర్శనుంచి తప్పించు కోడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఇప్పుడు ఆమెవద్ద విశ్వాన్ని ఆకర్షించే రూపంలేదు; యౌవనం లేదు; ధనమూ లేదు; యావత్ప్రపంచం ఆమెను ద్వేషిస్తుంది. ఆమె జీవమాత్రుల దయకు దూరమైంది. ఇటువంటి దుర్దినాలలో ఉపగుప్తుడు వచ్చి ఆమె తల నిమిరాడు.

వాసవదత్త ఆశ్చర్యంతో "ఎవరు?" అని అరచింది.

ఉపగుప్తుడు "నేను" అన్నాడు.

వాసవదత్త, కంఠ స్వరాన్ని కొంచెం గుర్తించింది. కాని, ఆమె తన భ్రమను తొలగించు కోవాలని "ఎవరు? నీవు ఉపగుప్తుడవా?" అని అడిగింది.

ఉపగుప్తుడు:- "అవును నేనే. ఉపగుప్తుడను."

వాసవదత్త ఒక దీర్ఘ శ్వాసను విడచి "తిరిగి వెళ్ళిపో. నీవు ఎందుకు వచ్చావు? నన్ను పరిహసించాలని వచ్చావా?" అంది.

ఉపగుప్తుడు:- "నీవు నన్ను వెళ్ళి పొమ్మంటున్నావా? నేనునీతో చెప్పినట్లుగానే నీ దగ్గరకు వచ్చాను. నేను రావడంలో ఆలస్యం కాలేదు. ఇంకా సంవత్సరం పూర్తి కావడానికి రెండు రోజులు మిగిలి వున్నాయి."

వాసవదత్త నిరాశతో "అయ్యో! నా దేహం వసంత సుగంధముతో పరిమళించి వున్నప్పుడు నీవు రాలేదు. నా సౌందర్య చంద్రిక భూమిమీద అమృతాన్ని వర్షించుచున్నప్పుడు నీవు రాలేదు. ఘాతకులు నాయౌవనాన్ని నాశనం చేయడానికి రాతిమీదతమ అస్త్రాల్ని నూరుచున్నప్పుడు కూడ నీవు రాలేదు. భిక్షు! నీవింత అమాయకుడ వేమి? నాసౌందర్య జ్యోతి ఆరిపోయింది. నా శోభాసూర్యుడు అస్తమించాడు. ఇటువంటి సమయంలో నీవు ఎందుకు వచ్చావు? అంది.

ఉపగుప్తుడు:-"సోదరీ! నేను ఇంద్రియ సుఖంవలన గాని, మరే ఇతర స్వార్థం వలవగాని ప్రేరేపింపబడి నీ వద్దకు రాలేదు. శారీరక సౌందర్యం వ్యర్థం - నీ ఈ శరీరమే దీనికి సాక్ష్యం ఇస్తున్నది. ధనంకూడ సారరహితమైనది. నీ అమిత ఐశ్వర్యం దీనికి జవాబిస్తున్నది. నేను నీ వద్దకు వచ్చాను. నీకు ఏమి చెప్పాలని వుందో చెప్పు!"

వాసవదత్త కళ్ళు తెరచుకొన్నవి-"నేను ఏంచెప్పను భిక్షు! నీ ప్రశ్నలు నా జవాబునుకూడ లాక్కొన్నవి. నేనొక స్వప్నం, ఒకనీడ, ఎండమావుల వెనుక పరుగెత్తుచున్నట్లుగా తోస్తున్నది. నేనేమీ చెప్పనక్కరలేదు. నీవు నాదగ్గర కొంతసేపు కూర్చో. నీ స్పర్శవలన నా బాధ తగ్గుతుంది. నీ మాటలవలన నా సంతాపం దూరమవుతుంది. భిక్షు! నీవే ఏదైనా చెప్పు," అంది ఆమె.

ఉపగుప్తుడు:-"ప్రాపంచిక దుఃఖాలకు మూలం"తృష్ణ." నీవీ తృష్ణకు దాసివై తిరిగావు. నీవు కామానికి, ధర్మాన్ని

అమ్మేవు. నీవు ధనకాంక్షతో నీ ప్రేమికుడైన లక్షపతిని చం పేవు. నే డీ దుఃఖసమయంలో నీవు చేసినపని ఏదికూడ ఉప యోగపడలేదు.''

వాసవదత్త:-''అయ్యో! భిక్షు! నీవు యింతకుముందే వచ్చి, నన్ను కర్మనుండి ఎందుకు రక్షించలేదు? నీవు వచ్చావు; కాని, చాల ఆలస్యంగా వచ్చావు.''

ఉపగుప్తుడు:-''ఏమీ ఆలస్యంకాలేదు. ఇప్పుడు చాల సమయంవుంది. నీ వీ సమయమున బాహ్యనేత్రాలను కోల్పో యావు. కాని, నీ అంతరనేత్రాలు తెరచుకొన్నాయి. లే. బోధసత్వ భగవానుని చేయిపట్టుకో. వారు నీ దుఃఖాన్ని నివా రిస్తారు. ముక్తురాలిని చేస్తారు.''

వాసవదత్త మనఃప్రపంచంలో ఆకాశమార్గంనుండి సుధాబిందువులు వర్షించాయి. ఆమె సాత్విక ప్రవృత్తి మేల్కొ న్నది. ప్రాపంచిక క్షణభంగురతను తెలుసుకొన్నది. తెలుసు కొనడమే కాదు, అనుభవంకూడ కలిగింది. ఆమె బౌద్ధసన్యాసి పాదాలయందు శిరస్సును వుంచి - ''నేను సిద్ధంగా వున్నాను. నన్ను తీసుకొనివెళ్ళు. నా చీరకొంగు పట్టుకొని నన్ను శాంతి రాజ్యంలోనికి తీసుకొనివెళ్ళు'' అంది.

బౌద్ధసన్యాసి తన పవిత్ర కరాలతో ఆమెను స్పర్శిం చాడు. ఇద్దరూ మఠంవైపుకు నడచారు.

పాపతాపముతో రసిక వాసవదత్త ప్రాయశ్చిత్త సుర సరితలో స్నానంచేసింది. సన్యాసము తీసుకొని తన శేష జీవి తంలో శాంతిని పొందింది.